

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త

ధాన్యం కొనుగోళ్లలో సమన్వయం పాటించండి

వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ

సుల్తాన్‌పూర్ రైస్ మిల్‌లో తనిఖీ చేస్తున్న కలెక్టర్

పరిగి, మే 26 ప్రభాతవార్త : రైతుల నుంచి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా చేయాలని, కొనుగోలు ప్రక్రియపై అధికారులు నిరంతరం పర్యవేక్షి ంచాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి తెలియజేశారు. మంగళ వారం, పరిగి నియో జకవర్గం, సుల్తాన్ పూర్ లోని వెంకట సాయి ఇండస్ట్రీస్ రైస్ మిల్లు ను స్థానిక శాసన సభ్యులు రామ్ మోహన్ రెడ్డి, సంబం ధిత అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యం, నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని తక్షణమే స్వీకరించి, నాణ్యత ప్రమాణాల ప్రకారం మిల్లింగ్ ప్రక్రియను సమ యానికి పూర్తి చేయాలని,హమాలీల సంఖ్యను పెంచుకోవాలని అధికారులకు ఆదేశించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం నిల్వలు పెరగకుండా మిల్లర్లు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. రంగంపల్లి గ్రామంలోని వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి, వివరాలను అడిగి తెలుసుకున్నారు.. ఎక్కువ మొత్తంలో ధాన్యం నిల్వలు ఉండకుండా వాహనాలను, హమాలీలను ఏర్పాటు చేసి, మిల్లులకు వెంటనే తరలించాలని సూచించారు. ధాన్యం రవాణా, హమాలి, నిల్వ, మిల్లింగ్ ప్రక్రియలో ఆలస్యం జరగకుండా, అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ సూచించారు. అనంతరం పరిగి మండలం, చిగురాల్ పల్లిలో స్వయం సహాయక సంఘ వర్క్ షెడ్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. మహిళలను అన్ని రంగాల్లో బలోపేతం చేసేందుకు ప్రభుత్వం మహిళా సంఘ భవనాలను ఏర్పాటు చేస్తుందన్నారు. హెల్త్ సెంటర్, మహిళా సంఘం వర్క్ షెడ్ నిర్మాణ పనులు జూన్ 30 వరకు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.పరిగి నందు యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను పరిశీలించిన అనంతరం కేజీబీవి స్కూల్ నిర్మాణ పనులను పరిశీలించారు. జిల్లా విద్యా శాఖ అధికారి రేణుకా దేవి, పంచాయతి రాజ్ ఈఈ ఉమేష్ కుమార్, పరిగి తహసిల్దార్ వెంకటేశ్వరి, డి ఎం సి ఎస్ మోహన్ కృష్ణ, డి ఎస్ ఓ సుదర్శన్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే గారేనా?

నేను.. సిఎస్‌ని

★శాసనసభ్యుడు మనోహర్‌రెడ్డికి ఫేక్ కాల్! ★ఫైనాన్స్ చీఫ్ సెక్రెటరీ అంటూ పరిచయం ★సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసిన తాండూరు ఎమ్మెల్యే

తాండూరు, మే 26, ప్రభాతవార్త : ఆర్థిక శాఖ చీఫ్ సెక్రెటరీని అంటూ.. వికారాబాద్ జిల్లా తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి సైబర్ నేరగాళ్లు ఫేక్ కాల్ చేశారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే ఓ ప్రకటన ద్వార వెల్లడించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పరిచయం చేసుకున్న ఓ వ్యక్తి నకిలీ ఫోన్ కాల్ చేసి మోసం చేయడానికి ప్రయత్నించారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి ఫోన్ చేసిన వ్యక్తి ఆర్థిక శాఖ కార్యాలయం నుండి మాట్లాడుతున్నానంటూ.. దిలీప్ కుమార్ పేరుతో ఎమ్మెల్యేకు ఫోన్ చేసిన వ్యక్తి మాట్లాడిన తీరు అనుమానాస్పదంగా ఉండటంతో.. ఇటీవల ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డికి కూడా ఇలాంటి ఫేక్ కాల్ వచ్చిన ఘటన, దానిపై ఆయన సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసిన వీడియోను గుర్తు చేసుకున్న ఎమ్మెల్యే అప్రమత్తమయ్యారు. తనకు వచ్చిన ఫోన్ కాల్ మోసం చేయడానికి వచ్చిందని వెంటనే వికారాబాద్ సైబర్ క్రైమ్ పోలీసు అధికారులకు అధికారికంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులను లక్ష్యంగా చేసుకొని నకిలీ పేర్లతో ఫోన్ చేసి మోసాలకు పాల్పడే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అపరిచితుల నుండి వచ్చే ఫ్రాడ్ కాల్స్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. అధికారులను ఇలాంటి వ్యక్తులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

శంషాబాద్‌లో ముమ్మరంగా డగ్స్ తనిఖీలు

రంగారెడ్డి అర్బన్ మే 26, ప్రభాతవార్త : యువత మాదకద్రవ్యాల వినియోగానికి బానిసలుగా మారకుండా దూరంగా ఉండాలని శంషాబాద్ రూరల్ సిఐ నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం శంషాబాద్ మండలంలోని పెద్ద షాపూర్, ముచ్చింతల్, పాలమాకుల మరియు పరిసర గ్రామాలలోని పోలీసులు, నార్కోటిక్ డ్రగ్స్ టీమ్ సంయుక్తంగా కిరాణా షాపులు, పాన్ షాపులు, టీ స్టాల్స్‌లలో తనిఖీలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ...మత్తు పదార్థాల వినియోగం వల్ల ఎంతో మంది జీవితాలు నాశనం అవుతు న్నాయని వాటి జోలికి ఎవరూ వెళ్లొద్దని మత్తు పదార్థాల అక్రమ రవాణను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ సహకరిం చాల న్నారు. అదేవిధంగా ప్రజలకు నార్కోటిక్ డ్రగ్స్ వల్ల కలిగే హానులు, చట్టపరమైన చర్యలు, యువతపై వాటి ప్రభావం గురించి అవగాహన కల్పించారు. ప్రజలు అనుమానాస్పద వ్యక్తులు లేదా మాదక ద్రవ్యాల విక్రయాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ బాలరాజ్, శంషాబాద్ పోలీస్ సిబ్బంది, నార్కోటిక్ డ్రగ్స్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

తనిఖీలు చేస్తున్న నార్కొటిక్ డ్రగ్స్ టీమ్

మధ్యవర్తులొస్తేనే
మోక్షం



ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి : కొత్త విద్యాసంవత్సరం ఆరంభమవుతుందంటే కొంతమం దికి పండగే పండగ. ప్రైవేటు స్కూళ్ల ఏర్పాటుకు అనేక కొర్రీలు పెడుతుంటారు. నిబంధనలను అడ్డం పెడుతూ ఫైళ్లను ముందుకు సాగనివ్వరు. నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిప్పుతూ అనవసర నిబంధనలను చూపి అనుమతులను నిరాకరిస్తున్నారు. చివరకు

వికారాబాద్ జిల్లాలో కొత్త స్కూళ్ల ఫైళ్లకు కొర్రీలు
90 శాతం వసతులున్నా తప్పని తిప్పలు..
కార్పొరేట్ యాజమాన్యాలకు విద్యాశాఖ చుక్కలు!
పాత స్కూళ్లలో 60శాతం నిబంధనల ఉల్లంఘన?
కొత్త వాటికి మాత్రం అడ్డుపుల్లలు!
ఉన్నత విద్యలో 50 జీఈఆర్ లక్ష్యం..
ప్రైవేట్ భాగస్వామ్యం పెంపునకు కేంద్రం కసరత్తు
జిల్లా ఆవిర్భావం నుండి డీఈఓ తిష్ట
టెన్త్ పేపర్ లీకేజీలో బలిపశువులైన టీచర్లు
తప్పున్నా తప్పించుకుంటున్న అధికారులు!

ప్రజాప్రతినిధుల నుంచి సిఫారసులు వచ్చేంత వరకు ఇబ్బందులు పెడుతూనే ఉంటారు. అలాగని పూర్తిస్థాయిలో అనుమతులను నిరాకరించరు.. మధ్య వర్తులు రంగంలోకి దిగగానే ఆ స్కూళ్లకు కియరెన్స్ వస్తుండటం వెనుక సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఈసారి దేశ వ్యాప్తంగా ప్రైవేట్ స్కూళ్ల అనుమతులకు కొర్రీలు పెట్టొందంటూ కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని తెలుస్తోంది. రానున్న పదేళ్లలో ఉన్నత విద్యలో స్థూల నమోదు నిష్పత్తి (జీఈఆర్)ని 50 శాతానికి పెంచాలని యోచిస్తోంది. ప్రైవేట్ స్కూల్ ఏర్పాటుకు ఎన్ని శాఖల నుంచి అనుమతులు, ఎన్వోసీలు పొందాలనే వివరాలు, స్థలం, నిబంధనలు, ఇతర వివరాలను తెలుసుకుంటున్నారు. దేశ వ్యాప్తంగా 23 శాతం మాత్రమే ప్రైవేట్ స్కూళ్లు ఉన్నట్లు సమాచారం.

కొత్త విద్యాసంవత్సరం వస్తోందంటే చాలు.. ప్రైవేటు పాఠశాలల అనుమతుల ప్రక్రియలో అధికారుల లీలలు, కొర్రీలు షరామామూలుగా మారిపోయాయి. నిబంధనలను అడ్డం పెట్టుకుని నెలల తరబడి ఫైళ్లను ఆఫీసుల చుట్టూ తిప్పడం, ప్రజాప్రతినిధుల సిఫారసులు లేదా మధ్యవర్తులు రంగంలోకి దిగితేనే క్లియరెన్స్ ఇవ్వడం వెనుక పెద్ద ఎత్తున అవినీతి ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

ప్రస్తుతం తెలంగాణలో ప్రైవేట్ స్కూలు ఏర్పాటు చేయాలంటే విద్యాశాఖ, పోలీసు, ఆర్అండ్‌బీ, అగ్నిమాపక, మున్సిపల్ శాఖల అనుమతులు తీసుకోవాలనే నిబంధనలు అమలు చేస్తున్నారు. పోస్టాఫీసు నుంచి రూ.25 నుంచి 50 వేల వరకు ఫిక్స్‌డ్ డిపాజిట్ల బాండ్లు పొందాలట. క్రీడల కోసం వెయ్యి చదరపు మీటర్ల మైదానం అవసరం ఉన్నా మున్సిపాలిటీలు లేదా గ్రామపంచాయతీల స్థలాన్ని లీజుకు తీసుకునే వెసలబాటు గతంలోనే కల్పించారు. ఇలాంటి నిబం ధనలను అడ్డం పెడుతూ అధికారులు అనుమతులు నిరాకరి స్తున్నారు. వికారాబాద్ జిల్లాలోని తాండూరు, పరిగి, వికారా బాద్, కొడంగల్ నియోజకవర్గాల్లో ప్రతియేటా పలు కొత్త స్కూళ్లు పుట్టుకొస్తున్నాయి. పలు కార్పొరేట్ సంస్థలు జిల్లా వైపు ఆసక్తి చూపుతున్నాయి. స్థానిక యాజమాన్యాల సహ కారంతో కొత్త స్కూళ్లను ఏర్పాటు చేసేందుకు సిద్ధమ వుతున్నాయి. అలా తాండూరులో ఓ కార్పొరేట్ స్కూలు ఏర్పాటుకు దాదాపు 90 శాతం వసతులు పూర్తి చేశారు. కానీ అధికారులు అనుమతులు ఇచ్చేందుకు రేపు, మాపు అంటూ కాలయాపన చేస్తున్నారు. జిల్లాలో ఉన్న ప్రైవేట్ స్కూళ్లలో దాదాపు 60 శాతం స్కూళ్లకు పూర్తిస్థాయిలో నిబంధనలు అమలు కావడం లేదు. అయినా ఆరంభంలో కఠినంగా వ్యవహరించే అధి కారులు క్రమంగా మెతకగా వ్యవహరించడం పరిపాటిగా మా రింది. కొంతమంది ప్రైవేట్ యాజమాన్యాలకు చెందిన వ్యక్తులే కొత్త స్కూళ్లకు అడ్డుపుల్ల వేస్తుంటారని తెలిసింది. వారికి అధికారులు సహకారం అందజేస్తున్నట్లు ఆరోపణలు వస్తు న్నాయి.

ఇలా ఉండగా వికారాబాద్ జిల్లా విద్యాశాఖ అధి కారి రేణుకాదేవి చాలాకాలంగా సేవలు అందిస్తున్నారు. జిల్లా ఆవిర్భావం తర్వాత ఆమె బదిలీ కావడం లేదు. ఈ జిల్లాలో కేవలం రెండు శాఖలకు చెందిన ఇద్దరు ఉన్నతాధికారులు మాత్రమే సుదీర్ఘ సేవలు చేస్తున్నారు. మూడేండ్ల క్రితం తాండూరులో టెన్త్ క్లాస్ పేపర్ లీకేజీలో బాధ్యుల్ని చేస్తూ నలుగురు ఉపాధ్యాయులను సస్పెండ్ చేశారు. వారిలో ఇద్దరు టీచర్లకు ఎలాంటి సంబంధం లేకున్నా బలి పశువును చేశారు. అయితే, శాఖపరంగా అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకోలేకపోయారు. పేపర్ లీకేజీ సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఇలాంటి పొరపాట్లు విద్యాశాఖ కాకుండా ఏశాఖలో జరిగినా అధికారులపై శాఖపరమైన వేటు పడేదని మేధావులు అంటున్నారు. మరి విద్యాశాఖపై ఎందుకు చర్యలు తీసుకోలేదనే అప్పట్లో ప్రశ్నలు ఉదయించాయి. కనీసం ఒక్క అధికారిని కూడా ప్రభుత్వం బదిలీ చేయలేకపోయింది. ప్రతి విద్యాసంవత్సరం ఆరంభంలో డీఈవో రేణుకాదేవి బదిలీ అవుతారనే ప్రచారం జరుగుతూనే ఉంటోంది.

రావులపల్లిలో పట్టుబడిన నకిలీ విత్తనాలు, నిందితులు

నకిలీల ఆటకట్టు

కర్నాటక సరిహద్దు నుంచి డూప్లికేట్ పత్తివిత్తనాలు అక్రమ రవాణా!
ఉక్కుపాదం మోపిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు
6.7 క్వింటాళ్ల పత్తి విత్తనాలు స్వాధీనం
నలుగురు అరెస్ట్

కొడంగల్, మే 26 ప్రభాతవార్త : వానాకాలం సాగు సీజన్ ప్రారం భం కానున్న నేపథ్యంలో వికారాబాద్ జిల్లాలో నకిలీ విత్తన మాఫియాపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఐపీఎస్ ఆదేశాల మేరకు ఇన్‌స్పెక్టర్ ఎస్.కె. అన్వార్ పాషా నేతృత్వంలో కొడంగల్, దౌల్తాబాద్ పరిధిలో నిర్వహించిన రెండు వేర్వేరు మెరుపు దాడుల్లో భారీ ఎత్తున నకిలీ పత్తి విత్తనాలు పట్టుబడ్డాయి. పోలీసులు మొత్తం 6.7 క్వింటాళ్ళ నకిలీ పత్తి విత్తనాలను, రవాణాకు ఉపయోగించిన ఒక వాహనాన్ని స్వాధీనం చేసుకుని, నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. పక్కా సమాచారంతో టాస్కోర్స్ బృందం రావుపల్లి వద్ద నిఘా ఉంచి తనిఖీలు చేపట్టగా, నిషేధిత నకిలీ విత్తనాలను అక్రమంగా తరలిస్తున్న ఉప్పలపాటి వసంతరావు యాద్గిర్ జిల్లా కర్నాటకలో పట్టుబడ్డాడు. అతని వద్ద నుండి 2.5 క్వింటాళ్ళ నకిలీ పత్తి విత్తనాలతో పాటు, రవాణాకు ఉపయోగించిన ఆక్టివా జుపిటర్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో కర్నాటకకు చెందిన మహేందర్‌రెడ్డి అనే మరో నిందితుడు ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. పట్టుబడిన నిందితుడిని, సొత్తును తదుపరి చర్యల కోసం కొడంగల్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు.

ఇన్‌స్పెక్టర్ అన్వార్ పాషా నేతృత్వంలోనే దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రెండో దాడిలో నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తున్న ముగ్గురు నిందితులను పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అరెస్ట్ అయిన వారిలో పునకాల సురేష్, (కర్నాటక) కళ్యాణ్ వీరేష్ (కర్నాటక), స్థానిక నీటూర్ గ్రామానికి చెందిన తలారి వేణు (35) ఉన్నారు. వీరి నుంచి 4.2 క్వింటాళ్ళ నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకుని దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు.

నిరంతరం నిఘా ఉంది : ఎస్పీ వార్నింగ్

అమాయక రైతులను మోసం చేస్తూ నిషేధిత నకిలీ విత్తనాలను విక్రయిస్తే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవు. జిల్లా వ్యాప్తంగా ఇటువంటి అక్రమ విక్రయాలపై నిరంతరం నిఘా ఉంటుంది. ఎక్కడైనా నకిలీ విత్తనాల సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలి అని ఎస్పీ స్నేహ మెహ్రా హెచ్చరించారు. సమర్థవంతంగా దాడులు నిర్వహించి నకిలీ విత్తనాల ముఠాను పట్టుకున్న టాస్కోర్స్ ఇన్‌స్పెక్టర్ అన్వార్ పాషా, వారి బృందాన్ని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

జర..తగ్గండి

షాద్‌నగర్ ఆర్డీవో కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న సిద్దాపూర్ గ్రామస్తులు

'వ్యర్థాల నిర్వహణ యూనిట్' నిర్ణయం ఉపసంహరించకపోతే ఆమరణ దీక్ష

షాద్‌నగర్, మే 26, ప్రభాతవార్త : పరిశ్రమలు అన్నారు.. ఉపాధి అన్నారు.. చివరికి రైతుల పొట్ట కొట్టి భూములు లాక్కున్నారు.. ఆ భూముల్లో ఇప్పుడు డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేసి మా జీవితాలను నాశనం చేయాలనుకుంటున్నారు.. సరే.. రండి.. తేల్చుకుందాం.. దీనిపై ఆమరణ దీక్షకు కూడా సిద్ధం.. సిద్ధాపూర్ మరో లగచర్ల అవుతుంది అంటూ సిద్దాపూర్ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ గ్రామాల పరిధిలో వ్యర్థాల నిర్వహణ యూనిట్ల ఏర్పాటు విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఆర్డీవో సరితకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ పరిసర గ్రామాలలో ఉన్న ప్రజలను ఇబ్బంది పెట్టేలా ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే భారీ ఎత్తున ఆందోళనకు తమ సిద్ధమని ప్రకటించారు. ఇంతకుముందే సర్పంచులు రాజీనామా చేస్తామని హెచ్చరించిన సంగతి తెలిసిందే కాగా, ఇప్పుడు గ్రామస్తులు కూడా ఒక తాటి మీదికి వచ్చి పోరాటం చేయడంతో ఆందోళన రోజురోజుకు ఉధృతం అవుతోంది. ఇక్కడ నిజానికి ఆ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నారా.. లేదా.. అన్న దానిపై అధికారులు కూడా స్పష్టత ఇవ్వకపోవడంపై ప్రజల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తం అవుతుంది. దీనిపై అధికారిక ప్రకటన వస్తే తప్ప ఆందోళన విరమించేది లేదని గ్రామస్తులు స్పష్టం చేస్తున్నారు. ఈ క్రమంలో ఆర్డీవో కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించిన గ్రామస్తులు ఆర్డీవోకు ఈ వినతి పత్రాన్ని అందజేశారు.

న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు

రైతులకు న్యాయం జరిగేంత వరకు తమ పోరాటం ఆపేది లేదనీ మహిళ నాయకురాలు నుస్రత్ బేగం హెచ్చరించారు. ఇప్పుడు వీళ్ల అనుకుంటున్న చెత్త సేకరణ యూనిట్ సమీపంలోనే పవిత్రమైన జాంగిర్ పీరు దర్గా ఉంది. అదేవిధంగా 1500 మందికి పైగా పిల్లలు చదువుతున్న ట్రైబల్ స్కూల్, గురుకుల పాఠశాలలు ఉన్నాయి. అధికారులు దీనిపై స్పష్టత ఇవ్వడం లేదు.. అందుకే పోరాటం మొదలుపెట్టాం. రేపటి నుంచి అమరణ దీక్ష కూడా చేస్తాం. ప్రజా పాలన పేరిట ఇంకా ఎంతకాలం మోసం చేస్తారు..? మీ ప్రజా పాలనలో ప్రామాణికత ఎక్కడ ఉంది..,? దీనిపై నిర్ణయం ప్రకటించకపోతే సిద్దాపూర్, రహీం తాండ, చింతకుంట, ఇనుముల నర్వ ఎప్పి పల్లి, కొడిచెర్ల తదితర గ్రామాల ప్రజలందరం ఆందోళనకు సిద్ధంగా ఉన్నాం.

ఎవరు వచ్చినా అడ్డుకుంటాం :
అంబటి ప్రభాకర్, కాంగ్రెస్ నేత

15 రోజులుగా పార్టీలకు అతీతంగా యూనిట్ విషయంలో పోరాటం చేస్తున్నాం. దీనికి ఎవరు అడ్డు వచ్చినా ఆగేది లేదు. సిద్దాపూర్‌ను మరో లగచర్ల చేస్తాం ఎవరు అడ్డు వచ్చినా ఊరుకునే పరిస్థితి లేదు.. కాలుష్యం వల్ల పిల్లల ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. భూములు అమ్మిన ఎవరూ కొనని పరిస్థితి ఏర్పడుతుంది. విద్యార్థుల భవిష్యత్తు నాశనం అవుతుంది. ఈ యూనిట్ ఏర్పాటు పై స్పష్టత వచ్చేదాకా ఈ పోరాటం కొనసాగుతుంది.

కాదు..కూడదు అంటే మా ఊరు మరో లగచర్ల అవుతుంది
సిద్ధాపూర్ గ్రామస్తుల తీవ్ర హెచ్చరిక
షాద్‌నగర్ ఆర్డీవో ఆఫీసు ముట్టడి

పార్టీ లేదు.. గీర్టీ లేదు.. పోరాటమే
శేఖర్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు

రాజకీయంగా పార్టీలకు సేవలు అందిస్తాం.. కానీ సమస్య మా దాకా వచ్చినప్పుడు పార్టీ లేదు గెర్టీ లేదు.. పోరాటమే. కలెక్టర్, ఆర్డీవో, ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు ఇచ్చాం. ఇక్కడ జేపీ దర్గా, పింజెర్ల అనంత పద్మ స్వామి లాంటి పవిత్ర ఆలయాలు ఉన్నాయి. ఇలాంటి చోట డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేసుకోవాలనుకోవడం దారుణం. ఎమ్మెల్యే శంకరన్న కొత్తూరు మండల ప్రజలు ఎంతో ఆదరించి గెలిపించారు. ఈ సమస్యపై ఆయన ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఆయన ప్రకటనను బట్టి చర్యలు తీసుకుంటారని నమ్మకం ఉంది. నమ్మినోళ్లను మోసం చేయొద్దు. గత ప్రభుత్వం పరిశ్రమలు పెడతామంటూ ఈ భూములు సేకరించింది. అలాంటి భూమిలో ప్రస్తుత ప్రభుత్వం చెత్త నింపాలనుకోవడం సరైన నిర్ణయం కాదు. ఎమ్మెల్యే దీనిపై పోరాడితే ఆయన వెంట నడుస్తాం. ఎస్ టి ఎస్ సిల పట్ల చులకన భావం వీడి పది తండాల పరిధిలో ఉన్న ఈ సమస్య పట్ల పాలకులు స్పందించాల్సిన అవసరం ఉంది.

ససేమిరా ఒప్పుకోం : ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్, మే 26, ప్రభాతవార్త : ఘన ద్రవ వ్యర్థాల నిర్వహణ యూనిట్ (డంప్ యార్డ్) ఎట్టి పరిస్థితుల్లో ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసే ప్రసక్తే లేదని దీనికి తను ససే మీరా ఒప్పుకునే పరిస్థితి లేదని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ వ్యవహారంలో భాగంగా ఆయా గ్రామాల రైతులు పెద్ద ఎత్తున ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి తరలివచ్చారు. కొత్తూరు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు శేఖర్ రెడ్డి, ఎస్ బి పల్లి అంబటి ప్రభాకర్, సురేష్, ఆగిర్ రవికుమార్ గుప్తా ఇంకా తదితర నాయకుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి డంపింగ్ యార్డ్ వ్యవహారాన్ని ప్రస్తావించారు. ఇదివరకే ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క, రంగారెడ్డి కలెక్టర్ తదితర అధికారుల దృష్టికి సుకువెళ్లినట్టు ఎమ్మెల్యే వారికి వివరించారు. ఇక్కడ డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయకుండా ప్రభుత్వం తరఫున పూర్తిస్థాయిలో తన వంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు. గ్రామస్తులు సంయమనం పాటించాలని కోరారు. అధికారుల నిర్ణయానికి వ్యతిరేకంగా గ్రామస్తులు నినాదాలు చేశారు.

పడిపోయిన చెట్లను తొలగిస్తున్న సిబ్బంది

అకాలవర్షంతో ఆగమాగం

పెనుగాలికి 22 కరెంట్ స్తంభాలు ధ్వంసం
పునరుద్ధరణ చర్యల్లో యంత్రాంగం

ఘట్‌కేసర్, మే 26, ప్రభాతవార్త: ఘట్‌కేసర్‌లో అకాల వర్షంతో విద్యుత్ స్తంభాలు విరిగిపోయి సరఫరా నిలిచిపో వడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఘట్‌కేసర్ డివిజన్‌లో 21.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమో దైంది. బలమైన ఈదురుగాలులతో కూడిన వడగళ్ల కురవ డంతో పట్టణంలో పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి. ఘట్‌కేసర్ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో మొత్తం 22 కరెంట్ స్తంభాలు దెబ్బతిన్నాయి. మధ్యాహ్నం నుంచి రాత్రి 11 గంటల వరకు కరెంట్ సరఫరా నిలిచిపోయి ప్రజ లు అవస్థలు పడ్డారు. ఘట్‌కేసర్ డివిజన్‌లోని ఎన్ఎఫ్ సీనగర్, శివారెడ్డిగూడ, టీచర్స్‌కాలనీ, బాలాజీనగర్, కొండాపూర్, మైసమ్మగుట్ట కాలనీ రోడ్డులో స్తంభాలు దెబ్బతిన్నాయి. విద్యుత్ ఏడిఈ, ఏఈలు సిబ్బందితో రంగంలోకి దిగా సహాయకచర్యలు చేపట్టి క్రేన్, జేసీబి సహాయంతో విరిగిన, ఒరిగిన స్తంభాలకు తగిన మరమ్మ తులు చేసి కరెంట్ సరఫరాను పునరుద్ధరించారు. మున్సి పల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ కరెంట్ స్తంభాల ఏర్పాటు పనులను పరిశీలించారు.

జోరుగా జీవాల విక్రయం

పాతబస్తీలో బక్రీద్ ముందస్తు సందడి

చాంద్రాయణగుట్ట, మే 26, ప్రభాతవార్త : ముస్లీం సోద రులు అత్యంత పవిత్రంగా, సాం ప్రదాయబద్ధంగా జరుపు కునే బక్రీద్ పండుగకు పాతబస్తీ సిద్ధమవుతోంది. ఈనెల 28 నుంచి ఈ పండుగను రెండు, మూడు రోజులు జరుపు కుంటారు. త్యాగానికి గుర్తుగా మేకలను, గొర్రెలను ఖుర్బానీ ఇవ్వటం సాంప్రదాయం కావటంతో ముస్లీంలు పెద్ద సంఖ్యలో జీవాలను ముందస్తుగానే కొను గోలు చేస్తున్నారు. దీంతో పాతబస్తీ వ్యాప్తంగా ప్రధాన రోడ్లు, కూడళ్లు, బస్తీలలో మేకల, గొర్రెల విక్రయాలు జోరుగా సా గుతున్నాయి. ప్రత్యేక గుడా రాలు, షామియానాలు వేసి వ్యాపా రులు వ్యాపారం నిర్వహిస్తున్నారు. బార్కా స్, చాంద్రాయణగుట్ట, అషమాబాద్, బండ్లగూడ, డీఎల్ ఆర్ఎల్, ఫూల్‌బాగ్, బాబానగర్, డీఆర్‌డీ ఎల్, ఫలక్ నుమా, ఇంజన్‌బౌలి, వట్టేపల్లి, నర్కిపూల్‌బాగ్, కిషన్‌బాగ్, బహదూర్‌పురా, ఖిల్వత్, శాలిబండ, జూపార్క్, పురానాపూల్, మీరాలంమండి, దారుల్‌షిఫా, డబీర్‌పురా, చం చల్‌గూడ, సైదాబాద్ తదితర ప్రాంతాలలో పెద్ద సంఖ్యల జీవాలను విక్రయిస్తున్నారు.



సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

బోరింగ్‌ను ప్రారంభిస్తున్న డిసిసి ఉపాధ్యక్షులు చంద్రశేఖర్

చార్మినార్,మే 26 ప్రభాతవార్త : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటి ఉపాధ్యక్షులు తిరుపతి చంద్రశేఖర్ అన్నారు. శాలిబండ డివిజన్ పరిధిలోని అలియాబాద్, షంషేర్‌గంజ్ బస్తీలలో మరమ్మతులు జరిగిన మంచి నీటి బోరింగులను ఆయన ప్రారంభించారు. ఈఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం పాటు పడుతున్నదని తెలిపారు. మంచి నీటి బోరింగులకు మరమ్మతులు చేయటం వల్ల స్థానిక ప్రజలకు ఎంతో ఉపయోగం కలుగుతుందని ఆయన తెలియజేశారు. వాటర్ వర్క్స్ అధికారులకు చంద్రశేఖర్ ధన్యవాదాలు తెలిపారు.

ప్రజలకు మజ్జిగ పంపిణీ

మజ్జిగ పంపిణీ చేస్తున్న కార్వాన్ మర్చంట్స్ అసోసియేషన్ సభ్యులు.

కార్వాన్,మే 26 ప్రభాతవార్త

కార్వాన్ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రజలకు వేసవి తాపాన్ని తగ్గించడానికి కార్వాన్ ప్రధాన రహదారిపై చల్లటి మజ్జిగ, మామిడిరసం, నిమ్మరసం పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భముగా ప్ర.కార్యదర్శి గోదా లక్ష్మీ మ్రకాంత్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం వేసవి ఎండల తీవ్రత విపరీతంగా పెరిగిపోయిం దని, ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో 47 డిగ్రీలకుపై చేరుకుంటున్న తరుణంలో వేసవి తాపాన్ని తగ్గించడానికి చిరు ప్రయత్నమన్నా రు. కార్యక్రమంలో మర్చంట్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు రా ము గులేకర్, కోశాధికారి పంబి శ్రీనివాస్, సభ్యులు రాజేష్ పాండ్యా, సన్నీ నుంజ, మహేష్, దత్త నాగేశ్, అద్దెట్ల ప్రేమ్ కుమార్ తదితర అసోసియే షన్ పాలకమండలి సభ్యులు పాల్గొని ప్రజలకు సేవలందించారు.

బాలల పురస్కార్ అవార్డుకు దరఖాస్తులు చేసుకోవాలి

జిల్లా సంక్షేమ అధికారి అక్కేశ్వరరావు

హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త:

జిల్లాలో ప్రతిభావంతులైన 518 ఏళ్లలోపు బాల బాలికలు "ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్"అవా ర్డుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి అక్కేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ధైర్య సాహసాలు, సామాజిక సేవ, క్రీడలు, కళలు, సాంకేతిక పరిజ్ఞానం వంటి రంగాల్లో విశేష ప్రతిభ చాటిన బాల బాలికలు అర్హులని తెలిపారు. ఆసక్తి, అర్హత గల వారు జులై 31 లోపు వెబ్ సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు డీసీపీవో శ్రీనివాస్ 8499888255 ను సంప్రదించాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

హెబ్రోన్ చర్చ్‌లో యౌవనస్థుల కూటములు ప్రారంభం

చిక్కడపల్లి మే 26 (ప్రభాతవార్త) : ప్రతిష్టాత్మక అఖిల భారత యౌవనస్థుల కూటముల కార్యక్రమం మంగళవారం గోల్కొండ చౌరస్తాలో బ్రదర్ భక్తసింగ్ స్థాపించిన ప్రముఖ క్రైస్తవ కేంద్రమైన హెబ్రోన్ చర్చ్ లో ప్రారంబయినాయి . ప్రతి ఏడాది నిర్వహించే అఖిల భారత యౌవనస్థుల కూటములు 31 వరకు జరుగుతాయని హెబ్రోను సొసైటీ అధికార ప్రతినిధి ఆర్. వీరాచారి తెలిపారు. ఈ పదిహేనువేల మంది వరకు యువతీయువకుల పాల్గొనవచ్చని, అందుకు కావలసిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. చైర్మన్ జి. జాన్ సుందర్ రావు మాట్లాడుతూ ఈ కూటములలో భారత దేశ యువతీ యువకులు చెడు అలవాట్లకు బానిసలు కాకుండా, సన్మార్గములో ఉండేటట్లు బోధిస్తామని తెలిపారు. ఆరు రోజులపాటు జరిగి కార్యక్రమానికి దేశ నలుమూలల నుండి వచ్చే యువతీ యువకులకు ప్రత్యేకమైన ఏర్పాట్లు సిద్ధం చేశామని తెలిపారు. యువతీ, యువకులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

గాన సభ లో మయూరి ఆర్ట్స్ రికార్డు నమోదుకు మెగా నృత్య ప్రదర్శన నిర్వహించిన దృశ్యం

గానసభలో మెగా నృత్య ప్రదర్శన

చిక్కడపల్లి మే 26 (ప్రభాతవార్త) : ప్రముఖ సాంస్కృతిక సేవా సంస్థ మయూరి ఆర్ట్స్ శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై యు ఎస్ ఏ బుక్ ఆఫ్ రికార్డ్ నమోదు కోసం భారీ నృత్య ప్రదర్శన నిర్వహించారు వివిధ నృత్య గురువుల శిష్య బృందం సుమారు మూడు వందల పైగా పలువురు వాగ్గేయ కారుల కీర్తనలకు అనుగుణం శాస్త్రీయ నృత్య అంశాలు తో పాటు జానపద నృత్యాలు ప్రదర్శించారు ఈ సందర్భంగా జరిగిన సభా కార్యక్రమంలో ప్రముఖ సామాజిక కార్యకర్త వెంకట్ కళా కారులకు సర్టిఫికెట్ లు జ్ఞాపిక లు బహుకరించారు సంస్థ స్థాపకులు రాధ పర్యవేక్షణ చేశారు.

మహేష్ కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న తొలుపునూరి కృష్ణగౌడ్, నాగభూషణం

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

: పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్

హైదరాబాద్, మే 26 ప్రభాతవార్త

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. మంగళ వారం టిపిసిసి ప్రధాన కార్యదర్శి నాగభూషణం, కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్‌లు మహేష్‌కుమార్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికలలో కూడా కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు.

కుత్బుల్లాపూర్ వరదనీటి నాలాల అభివృద్ధి పనులు వేగవంతం : ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్

కుత్బుల్లాపూర్, మే 26 ప్రభాతవార్త

కుత్బుల్లాపూర్ పరిధిలోని లోతట్టు ప్రాంతాలైన రామిరెడ్డి నగర్, సూర్యానగర్‌ల తోపాటు కెమికల్‌నాలాకు ఆనుకుని ఉన్న ప్రతిబస్తీ, కాలనీలను వరదనీటి ప్రమాదం నుండి కాపాడేందుకు చర్యలు చేపడతామని కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కె.పి. వివేకానంద్ హామీఇచ్చారు. మంగళ వారం కుత్బుల్లాపూర్ పరిధిలోని రామిరెడ్డినగర్, సూర్యానగర్‌లలో పర్యటించి అనంతరం సూర్యానగర్ కమ్యునిటీ హాలులో జరిగిన సమావేశంలో నాలాల విస్తరణపై సంక్షేమ సంఘాల ప్రతినిధులతో చర్చించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోనే అతిపాతవైన రామిరెడ్డినగర్, సూర్యానగర్, పాపయ్యయాదవ్‌నగర్ నాలా విస్తరణకు వేగవంతంగా పనులను నిర్వహించి రాబోయే వర్షాకాలం లోపు అన్ని నాలాలకు రిటర్నింగ్‌వాల్స్‌ను పూర్తిచేస్తామని హామీఇచ్చారు. చింతల్ రామిరెడ్డినగర్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరీఅయ్యి టెండర్ ప్రక్రియ కూడా పూర్తయిందని త్వరలో శంకుస్థాపన చేసి పనులను పూర్తిచేస్తామని హామీఇచ్చారు. చింతల్ రామిరెడ్డినగర్ సంక్షేమ సంఘ అధ్యక్షులు గల్వా యాదవరెడ్డి మాట్లాడుతూ జగద్గిరిగుట్ట నుండి లోతట్టు ప్రాంతాలైన రామిరెడ్డినగర్, సూర్యానగర్ పాపయ్యయాదవ్‌నగర్ ప్రాంతాలతోపాటు చుట్టుపక్కల కాలనీలు, బస్తీలను వరదనీరు నింపివేస్తూ ఆందోళనకు గురిచేస్తుందని ఎంఎల్ఏ వివేకానంద్ దృష్టికి తీసుకువచ్చారు. రామిరెడ్డినగర్ సంక్షేమ సంఘ ప్రధాన కార్యదర్శి రాజన్నగౌడ్, ఉపాధ్యక్షులు హీరాలాల్, సురేశ్, జయేందర్‌గౌడ్, సూర్యానగర్ సంక్షేమసంఘ అధ్యక్షులు అశోక్‌గౌడ్, ప్రధానకార్యదర్శి సురేశ్, గణేష్‌నగర్ సంక్షేమ సంఘ ప్రతినిధులు యాదగిరి(బాపు), నాయకులు దేవర కొండ శ్రీనివాస్, సత్తిరెడ్డితదితరులు తమతమ కాలనీల సమస్యలను ఎంఎల్ఏ వివేకానంద్‌కు వివరించారు. ఈసందర్భంగా వివిధ విభాగాల అధికారులు , సిబ్బంది పాల్గొన్నారు.

అర్ధశతాబ్ధం పూర్తియిన సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా స్వర్ణోత్సవాలు

సైఫాబాద్, మే 26 ప్రభాతవార్త:

బంజారాలను 1976లో బంజారాల అశాజ్యోతి నాటి ప్రధాని ఇందిరాగాంధీ ఎస్టీ జాబితాలో చేర్చి అర్ధ శతాబ్దం పూర్తి అవుతున్న సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉత్సవాలు నిర్వహిస్తూ ఆమె చిత్రపటానికి పాలాభిషేకాలు నిర్వహించాలని పలువురు బంజారా నాయకులు పిలుపు నిచ్చారు. ఈ మేరకు మంగళవారం న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో జరిగిన బంజారా నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ జూన్ మాసంలో గ్రామాలు, మండలాలు, జిల్లాల్లో భారీగా ర్యాలీలకు ప్రణాళికలను రూపొందిస్తామన్నారు. 2 వేల మంది యువతతో భారీ ర్యాలీని హైదరాబాద్ నగరంలో చేపడతామని చెప్పారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు బంజారాల ముఖ్య ప్రజా ప్రతినిధులతో ఈ సమావేశం కొనసాగింది. నాడు (18-9-1976) ఇందిరాగాంధీ తీసుకున్న విప్లవాత్మక నిర్ణయం వల్లనే నేడు బంజారా సమాజానికి సామాజిక న్యాయం జరిగిందన్నారు. విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాలలో గిరిజన బిడ్డలకు ఉన్నత స్థానాల్లో రాణిస్తున్నారని సమావేశంలో

ఎమ్మెల్యే క్వార్టర్‌లో జరిగిన బంజారా నేతల సమావేశంలో పాల్గొన్న బలరామ్‌నాయక్, శంకర్‌నాయక్, రాందాస్‌నాయక్, ఎస్.రాములునాయక్ తదితరులు

పాల్గొన్న నాయకులు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపి బలరామ్ నాయక్, ఎంఎల్‌సి కేతావత్ శంకర్‌నాయక్, ఎంఎల్ఏ మలోత్ రామ్‌దాస్‌నాయక్, మాజీ ఎమ్మెల్సీ సభావత్ రాములునాయక్, మాజీ మంత్రి రవీందర్‌నాయక్, ట్రైకార్ ఛైర్మన్ బెల్లయ్యనాయక్, టి పిసిసి అధికార ప్రతినిధి వెంకన్ననాయక్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు కిషన్‌సింగ్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

జవహర్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో ఆసరా కెవైసి కౌంటర్ : మాజీ కార్పొరేటర్

-తప్పిన ఎండల తిప్పలు.. లబ్ధిదారుల హర్షం

చిక్కడపల్లి మే 26 (ప్రభాతవార్త) : గాంధీనగర్ డివిజన్ పరిధిలోని ఆసరా పెన్షన్ లబ్ధిదారుల సౌకర్యార్థం జవహర్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో ప్రత్యేక కేవైసీ అప్‌డేట్ కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. మాజీ కార్పొరేటర్ శ్రీమతి ఎ.పావని వినయ్‌కుమార్ ప్రత్యేక చొరవతో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని మంగళవారం ఆమె బీజేపీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ పావని వినయ్ మాట్లాడుతూ ముషీరాబాద్ మండల రెవెన్యూ కార్యాలయంలో రద్దీ కారణంగా వృద్ధులు, మహిళలు మండుటెండల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గమనించి, స్థానికంగానే ఈ ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. దీనివల్ల లబ్ధిదారులకు కేవైసీ ప్రక్రియ ఎంతో సులభతరమైందని పేర్కొన్నారు. మొదటి రోజు దాదాపు 70 మంది లబ్ధిదారులు తమ కేవైసీని పూర్తి చేసుకున్నారని వివరించారు.

నేడు కొనసాగనున్న ప్రక్రియ

బుధవారం కూడా ఉదయం 10:00 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు ఎంఆర్‌ఓ అధికారుల ఆధ్వర్యంలో ఈ అప్‌డేట్ ప్రక్రియ కొనసాగుతుందని పావని వినయ్‌కుమార్ తెలిపారు. డివిజన్‌లోని పెన్షన్ లబ్ధిదారులు, మహిళలు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు శివ సత్యప్రసాద్, రాము, భార్గవి, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు వి.నవీన్‌కుమార్, సీనియర్ నాయకులు రత్న సాయిచంద్, శ్రీకాంత్, దామోదర్, వీఎస్‌టీ రాజు, ఎం.ఉమేష్, ఆనంద్‌రావు, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. కౌంటర్ ఏర్పాటుపై స్థానిక ప్రజలు సర్వత్ర హర్షం వ్యక్తం చేశారు.

జవహర్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో ఆసరా కేవైసీ కౌంటర్

పురానాపూల్‌లో పర్యటించిన రాష్ట్ర సెన్సెస్ డైరెక్టర్ భారతి హొళ్లికేరి

చార్మినార్,మే 26 ప్రభాతవార్త : ప్రజలు నుంచి సమగ్రమైన సమాచారాన్ని సేకరించి జనగణన ప్రక్రియను సమర్ధవంతంగా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర సెన్సెస్ ఆఫరేషన్ డైరెక్టర్ భారతి హొళ్లికేరి అధికారులను ఆదేశించారు. జిహెచ్ఎంసి చార్మినార్ జోన్ పరిధిలోని పురానాపూల్ ప్రాంతంలో జరుగుతున్న జనగణన ప్రక్రియను మంగళవారం రాష్ట్ర సెన్సెస్ ఆఫరేషన్ డైరెక్టర్ భారతి హొళ్లికేరి, చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ కే. సత్యనారాయణతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పురానాపూల్‌లో ఇంటింటికి తిరుగుతూ ఎన్యుమరేటర్లు నిర్వహిస్తున్న సర్వే విధానం, ప్రజలనుంచి వివరాలు సేకరణ నమోదు ప్రక్రియపై భారతి హొళ్లికేరి ప్రజలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటికి వెళ్లి పూర్తి స్థాయిలో వివరాలు నమోదు చేయాలని, ప్రభుత్వం నిర్ధేశించిన 34 ప్రశ్నలను తప్పని సరిగా సేకరించాలని ఆధికారులను ఆదేశించారు. జనగణన ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు లేకుండ ఖచ్చితమైన సమాచారం నమోదు చేయటం అత్యంత ముఖ్యమని భారతి హొళ్లికేరి తెలిపారు. ప్రజలు కూడ అధికారులకు సహకరించి సరైన సమాచారంఅందించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ సత్యనారాయణ, చార్మినార్ డిఎంసి సరిత, సంబంధిత విభాగాల అధికారులు, సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

ఉర్రూతలూగించిన మహిళల కళ ప్రదర్శనలు

మహిళా కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలోని దృశ్యం

రవీంద్రభారతి, మే 26 ప్రభాతవార్త :

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి పర్యవేక్షణలో తెలంగాణ ప్రజాకళ శీర్షికన ఏప్రిల్ 1నుండి నిర్విరామంగా జరుగుతున్న 99 రోజుల ప్రతిష్టాత్మక సాంస్కృతిక కళారూపాల ప్రదర్శనల్లో భాగంగా రవీంద్ర భారతి ప్రాంగణంలోని పాల్కురికి సోమన్న (ఘంటసాల) కళావేదికలో వివిధ తెలంగాణ కళా సాంస్కృతిక మహోత్సవాలలో భాగంగా తెలంగాణ ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలు, కళలకు పట్టంకడుతూ మంగళవారం రాత్రి మహిళా కళాకారుల వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు కళాభిమానులు, ఆహుతులను ఉర్రూతలూగించాయి. ముఖ్యంగా గడ్డం భారతి బృందం ప్రదర్శించిన మహిళా కోలాటం; రమా బృందం ప్రదర్శించిన మహిళా డప్పుల దరువు ధూంధాంగా సాగాయి. అలాగే వరంగల్ జిల్లా నుండి విచ్చేసిన సువర్ణ జానపదగేయం, శివకళ్యాణి కవితాగానం మంత్రముగ్ధులను చేశాయి. వ్యాఖ్యాతలుగా సోని, విద్యానందచారి, శ్రీనివాసరాజులు వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి ఆయా కళాకారులను ఘనంగా సన్మానించి అభినందించారు.

ఓఆర్ఆర్‌పై నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

-వాహనాదారులకు అవగాహన కల్పిస్తూ కరపత్రాల పంపిణీ

అత్తాపూర్ మే26 ,ప్రభాతవార్త : ఔటర్ రింగ్ రోడ్డుపై ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలిపితే కఠిన చర్యలు తప్పవని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఎస్‌హెచ్‌ఓ సిహెచ్ రాజు హెచ్చరించారు. ఇటివల ఓఆర్ఆర్‌పై వరసగా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటుండడంతో మంగళవారం ఓఆర్ఆర్ ఎగ్జిట్ 17 వద్ద ట్రాఫిక్ సిఐ రాజుతో కలిసి ట్రాఫిక్ ఎసిపి రామకృష్ణ వాహనదారులకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడారు.. ఓఆర్ఆర్ పై వాహనాదారులు నిబంధనలకు విరుద్ధంగా నిలిపడంతో రోడ్డు ప్రమాదాలు చేసుకుంటున్నాయని ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని లేకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఓఆర్ఆర్‌పై వాహనాలను నిలిపివేయడం, పార్కింగ్ చేయడంతో ప్రమాదాలకు దారితీస్తుందని అధిక వేగంతో వెళ్తున్న వాహనాల వల్ల ప్రాణాపాయం సంభవించవచ్చుని వాహనానికి యాంత్రిక లోపం ఏర్పడితే వెంటనే హజార్డ్ లైట్లు వేయాలని నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు ,జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. అత్యవసర సహాయం కోసం వెంటనే 1449/1800 5996699లను సంప్రదించాలని సూచించారు.

డ్రైవర్లకు సడక్ సురక్షపై అవగాహన సదస్సు

ఘట్‌కేసర్ రూరల్, మే 26, ప్రభాత వార్త: డ్రైవర్లు సురక్షితమైన డ్రైవింగ్ పద్ధతులు ఆవలభించాలని కళాశాల డీన్ ఎస్‌ఓఈ వి. విజయ్ కుమార్ అన్నారు. పోచారం డివిజన్ వెంకటాపూర్ అనురాగ్ యూనివర్శిటీలో డ్రైవర్ల కోసం (సడక్ సురక్ష) రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. అనురాగ్ యూనివర్శిటీ ఎన్ఎస్ఎస్ సెల్ యూనిట్ 3, హీరోకార్ప్ సహకారంతో సురక్షితమైన డ్రైవింగ్ పద్ధతులు, రోడ్డు భద్రతా అవగాహనను ప్రోత్స హించేందుకు యూనివర్శిటీ డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అదిక్ సాగర్ మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలు, రక్షణాత్మక డ్రైవింగ్ పద్ధతులు, ప్రమాద నివారణ చర్యలు, బాధ్యతాయుతమైన డ్రైవింగ్ ప్రాముఖ్యతపై విజ్ఞానదాయకమైన ప్రసంగం చేశారు. డ్రైవర్లు ప్రయాణికుల భద్రతను నిర్ధారించడానికి డ్రైవింగ్ చేసేటప్పుడు క్రమశిక్షణ అవసరాన్ని నొక్కి చెప్పారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ డీన్ చలపతి శ్రీనివాస్‌రావు, ఎన్ఎస్ఎస్ యూనిట్ 3 ప్రోగ్రామ్ ఆఫీసర్ పురుషోత్తం, ట్రైనర్ విద్యా సాగర్‌లు పాల్గొన్నారు.

నా స్మృతి పథంలో జీవిత అనుభవాల సారం : జస్టిస్ రాధారాణి

చిక్కడపల్లి మే 26 (ప్రభాతవార్త) : వంశీ రామరాజు రచించిన నా స్మృతి పథం లో రెండవ భాగం ఆయన జీవిత అనుభవాల సారం అని రాష్ట్ర వినియోగ దారుల వివాదాల పరిష్కార కమిషన్ చైర్ పర్సన్ జస్టిస్ రాధా రాణి అన్నారు మంగళవారం వంశీ ఆర్ట్స్ థియేటర్స్ నిర్వహణలో వండే రామ రాజు రచించిన నా స్మృతి పథం లో రెండవ భాగం ఆవిష్కరణ, ప్రముఖ నటుడు చంద్ర మోహన్ వంశీ గ్లోబెల్ పేరిట అవార్డు నటి రోజా రమణి నిర్మాత లు ఏడిద రాజా శివలింక కృష్ణ ప్రసాద్ రేలంగి నరసింహారావు కాస్ట్యూమ్స్ డిజైనర్ సాంబశివ రావు లకు ప్రదాన సభ జరిగింది ముఖ్య అతిథిగా పాల్గొన్న జస్టిస్ రాధా రాణి అవార్డ్ ప్రదానం చేసి గ్రంథ ఆవిష్కరణ చేసి మాట్లాడారు రామ రాజు తన పుస్తకం లో తనకు పరిచయం ఉన్న ప్రముఖుల గురించి ఆసక్తి కరం గా రాశారు అని చెప్పారు చంద్రమోహన్ విభిన్న కథా నాయకుడు అని ఆయన పేరిట అవార్డ్ లు ఇవ్వటం ప్రత్యేకించి కాస్ట్యూమ్ డిజైనర్ కి ఇవ్వటం విశేషం అన్నారు అధ్యక్షత వహించి డాక్టర్ రమణ మాట్లాడుతూ రామ రాజు వంశీ

డాక్టర్ వంశీ రామరాజు రచించిన నా స్మృతి పథంలో గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ రాధారాణి

సంస్థ ల అధినేత గానే కాక 36, పుస్తకాలు రచయిత గా కూడా గుర్తింపు పొందారు అని అభినందించారు తెలుగు విశ్వవి ద్యాలయం ఉప కులపతి ఆచార్య నిత్యానంద రావు మాట్లాడు తూ ఆర్థికం గా ప్రణాళిక ప్రకారం వంశీ రామరాజు కార్యక్ర మాలు చేస్తారు అని చెప్పారు వెదిక పై రచయిత బురుగుపల్లి రాధా కృష్ణ జలంధర చంద్ర మోహన్ సాహితీ కిరణం సంపాదకుడు పొత్తూరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు .

ఖాళీ బిందెలతో బిఆర్ఎస్ నేతల ఆందోళన

జూబ్లీహిల్స్, మే 26, ప్రభాతవార్తః

బంజారాహిల్స్ రోడ్ నంబరు 7లోని జలమండలి కార్యాలయం ముందు ఖాళీ బిందెలతో మంగళవారం ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేతలు ఆందోళనకు దిగారు. గత రెండు నెలలుగా పలు బస్తీలు, కాలనీలలో సమయానికి తాగునీరు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో మంగళవారం ఉదయం ఉదయ్‌నగర్‌కు చెందిన ముర్తుజా ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని రోడ్ నెంబర్7లోని జలమండలి కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి డీజీఎం శరత్ కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్య క్రమంలో ఖైరతాబాద్ నియోజకవర్గ టీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మన్నె గోవర్ధన్ రెడ్డి, మాజీ చైర్మన్ విప్లవ్ కుమార్, బీఆర్ఎస్ నేతలు శ్రీనివాస్ నాయుడు, సుజాత, విజయ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మన్నె గోవర్ధన్ రెడ్డి మాట్లాడు తూ, బస్తీవాసులు కాలి బిందెలతో నిరసన వ్యక్తం చేయాల్సిన పరిస్థితి రావడం చాలా దురదృష్టకరమన్నారు. బంజారాహి ల్స్ డివిజన్‌లోని పలు కాలనీలు, బస్తీలలో లో ప్రెజర్ వాటర్ సమస్యతో పాటు సమయానికి నీరు రాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు

ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తున్న స్థానికులు, బీఆర్ఎస్ నేతలు

వెంటనే స్పం దించి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి అని డీజీఎం శర త్ కుమార్‌ని కోరామన్నారు. డీజీఎం స్పందిస్తూ ఒకటి రెండు రోజుల్లో స్వయంగా సంబంధిత బస్తీలు, కాలనీలను సందర్శించి సమస్య ఎక్కడ ఉందో గుర్తించి తక్షణ చర్యలు తీసుకుంటామని, ప్రజలకు సమయానికి తాగునీరు అందేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ ధర్నా కార్యక్ర మంలో సీనియర్ నాయకులు బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు సారంగపాణి, నాగరాజు, అన్వర్, శశి ప్రతాప్ రెడ్డి, రాజేశ్వర్, విశ్వనాథం, శ్రీనివాస్, కృష్ణమ్మ పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తల సన్నాహక సమావేశం

నిజాంపేట్, మే 26, ప్రభాతవార్త

కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ మానకొండూరు అసెంబ్లీ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో వారి కార్యాలయంలో మంగళవారం ఈ సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ మానకొం దూరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి గ్రామ, మండల కమిటీలను మరింత బలోపేతం చేయాలని నాయకు లకు సూచించారు. అలాగే కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టను న్న ఎస్ఐఆర్ కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహిం చినట్లు తెలిపారు. ఓట్ల తొలగింపులు జరగకుండా అప్రమత్తం గా ఉండాలని, నకిలీ ఓట్ల తొలగింపులో బూత్ స్థాయిలో కాంగ్రెస్ కార్యకర్తలు చురుకుగా పనిచేయాలని పిలుపునిచ్చా రు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు, ఆరు గ్యారం టీలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వివిధ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హులైన వారికే సంక్షేమ పథకాలు

గన్‌ఫౌండ్రి,మే 26 ప్రభాతవార్త: ప్రజా సంక్షేమ పథకాలను పొందేందుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని నాంపల్లి మండల తహసీల్దార్ నహీముద్దీన్ అన్నారు. రెవెన్యూ అధికారులు ఇసామియా బజార్ తదితర బస్తీలో పెన్షన్లు పొందుతున్న 200మందివివరాలను సేకరించారు. వృద్దులు, వికలాంగులు, ఒంటరి మహిళలు జీవించి ఉన్నారా లేక మృతి చెందరా అనే విషయాన్ని నిర్ధారించుకునే క్రమంలో ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్ల వివరాలను సేకరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ ప్రధా న కార్యదర్శి బద్దం సతీష్‌గౌడ్ మాట్లాడుతూ పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న కొత్త వారికి ప్రభుత్వం స్పందించి పెన్ష న్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్‌యాదవ్, రాధకృష్ణ, లోహిత్, ఆనంద్ పాల్గొన్నారు.

లైంగికదాడి కేసులో నిందితుడికి జైలు,జరిమానా

అత్తాపూర్ మే26 ,ప్రభాతవార్త : నాలుగేళ్ల బాలికపై లైంగిక దాడి కేసులో నింది తుడికి 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ ఫోక్సో కోర్టు తీర్పు వెలువరించింది. సిఐ ముత్తు యాదవ్ వివ రాల ప్రకారం...రాజేంద్రనగర్ మండల పరిధిలోని ఉప్పర్‌పల్లి ఎర్రబోడలో 04-06-2019లో బాలిక ఇతర పిల్లలతో కలిసి ఆడుకుంటోంది. ఈ క్రమంలో పొరుగున ఉండే నిందితుడు చిల్కూర్ సందీప్ కుమార్ అలియాస్ శ్యామ్ బాలికకు మాయ మాటలు చెప్పి తన నివాసానికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్ప డ్డాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు రాజేంద్ర నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి కోర్టులో ఆధారాలు సమర్పించగా మంగళవారం అత్యాచారం కేసులో నిందితుడిని దోషిగా ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక న్యాయమూర్తి నిర్ధారించారు. దీంతో నిందితుడుకి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షణతో పాటు రూ.50వేల జరిమానా విధించింది. అలాగే బాధితురాలికి రూ.3లక్షల నష్టపరిహారం చెల్లించాలని ఆదేశించింది.. ఈ కేసు దర్యాప్తులో అప్పటి దర్యాప్త అధికారి ఎసిపి అశోక్ చక్రవర్తి ,స్పెషల్ పిపి వెంకటేశ్వర రెడ్డి, సిడిఓ వి.కృష్ణయ్య, సమన్లు అధికారి నరసింహులు ,ఇతర పోలీసు సిబ్బంది కీలకంగా వ్యవరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కేసును సమర్థవంతంగా దర్యాప్తు చేసిన పోలీస్ అధికారులను కమిషనర్ వి.సి. సజ్జనార్, ప్రత్యేకంగా అభినందించారు.

సిడిఈడబ్ల్యు కౌన్సెలింగ్ కేంద్రానికి వెళ్లిన వ్యక్తి అదృశ్యం

జూబ్లీహిల్స్, మే 26, ప్రభాతవార్త: కౌన్సె లింగ్‌కు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన పంజాగుట్ట ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. పంజాగుట్ట పోలీసుల కథనం ప్రకారం.. కొండాపూర్‌కు చెందిన వెన్నంరెడ్డి యశ్వం త్ తండ్రి వెన్నంరెడ్డి నరసింహామూర్తి(55) ఈ నెల 23న పంజాగుట్ట పోలీస్ స్టేషన్ సమీపంలోని సిడిఈడబ్ల్యు కౌన్సె లింగ్ సెంటర్‌కు వెళ్లారు. ఒక మహిళ ఇచ్చిన ఫిర్యాదుకు సంబంధించి కౌన్సె లింగ్ కోసం వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే కౌన్సె లింగ్ అనంతరం నరసింహామూర్తి ఇంటికి తిరిగి రాలేదని, అప్పటి నుంచి ఆయన ఆచూకీ తెలియడం లేదు. దీనికితోడు ఇంటి నుంచి బయలుదేరే సమయంలో తన మొబైల్ ఫోన్‌ను ఇంట్లోనే మర్చిపోయి వెళ్లడంతో ఆయనను సంప్రదించే అవకాశం లేకుండా పోయిం ది. కుటుంబ సభ్యులు స్వయంగా అనేక ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. బాధితుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

శభాష్ ఉల్లాఖాన్

ధారూర్, మే 26, ప్రభాతవార్త: సుదీర్ఘ కాలం పాటు ఒకే మండలంలో పని చేయడం.. అది కూడా ఎలాంటి ఆరోపణలు లేకుండా, అందరి మన్ననలు పొందుతూ విధులను ముగించడం అందరికీ సాధ్యం కాదు. కానీ, వికారాబాద్ జిల్లా ధారూర్ మండల పంచాయతీ అధికారిగా పనిచేసిన సఫీ ఉల్లా ఖాన్ ఆ సాధ్యం కాని విషయాన్ని సుసాధ్యం చేసి చూపించారు. తెలంగాణ ప్రభుత్వ పంచాయతీరాజ్ శాఖ చేపట్టిన సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్మెట్ మండలానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ధారూర్ మండలంలో ఆయన అందించిన సేవలను స్థానికులు, పంచాయతీ కార్యదర్శులు గుర్తుచేసుకుంటున్నారు.

గత 2020లో సఫీ ఉల్లా ఖాన్ ధారూర్ మండలానికి బదిలీపై వచ్చారు. ఆయన బాధ్యతలు చేపట్టిన నాటి నుండి నేటి వరకు (దాదాపు 6 సంవత్సరాల పాటు) మండల పంచాయతీరాజ్ శాఖలో తనదైన ముద్ర వేశారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో, గ్రామాలను ప్రగతి పథంలో నడిపించడంలో ఆయన నిరంతరం శ్రమించారు. ధారూర్ మండలానికి ఒక ప్రత్యేకమైన గుర్తింపును, పంచాయతీరాజ్ శాఖకు మంచి పేరును తీసుకురావడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. సాధారణంగా ఉన్నతాధికారులు అంటే ఒత్తిడి తెస్తారనే భావన ఉంటుంది. కానీ సఫీ ఉల్లా ఖాన్ శైలి మాత్రం ఇందుకు భిన్నం. ధారూర్ మండల పరిధిలోని ఏ ఒక్క పంచాయతీ కార్యదర్శికి కూడా చెడ్డపేరు రాకుండా, ఎవరికీ ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆయన చూసుకున్నారు. చేయూతనుస్తూ, పనిచె య్యిస్తూ కార్యదర్శులకు ఎల్లప్పుడూ వెన్నుదన్నుగా నిలిచారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి సమస్యలు వచ్చినా తానే ముందుండి పరిష్కరిస్తూ, కార్యదర్శులను సమర్థవంతంగా నడిపించారు. ఆరేళ్ల సుదీర్ఘ కాలంలో ఆయనపై ఎలాంటి అవినీతి లేదా అలసత్వపు ఆరోపణలు రాకపోవడం ఆయన నిబద్ధతకు నిదర్శనం.

తెలంగాణ ప్రభుత్వం ఇటీవల ఒకే స్థానంలో సుదీర్ఘ కాలంగా పనిచేస్తున్న అధికారులకు చేపట్టిన సాధారణ బదిలీల్లో భాగంగా సఫీ ఉల్లా ఖాన్ స్థానచలనం కలిగింది. ఆయన ఇక్కడి నుండి రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్మెట్ మండలానికి బదిలీపై వెళ్లారు. ధారూర్ మండలంలో సఫీ ఉల్లా ఖాన్ సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయి.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL SENIOR CIVIL JUDGE CUM CHIEF JUDICIAL MAGISTRATE AT: L.B. NAGAR, RANGA REDDY DISTRICT

O.S. No. 142 of 2026

Between: -
Taneeru Nagamani and others ...Plaintiffs
AND
1. The Tahsildar, Abdullapurmet Mandal, R.R. District
2. To all Concerned. ...Defendants

The above-named Plaintiffs filed the above suit for the relief of Declaration, declaring that Plaintiffs are the only legal heirs of Late Tanneru Venkanna, S/o. Late T. Narsaiah in respect of the Suit Schedule Property i.e., All that the Open land bearing Plot Nos. 9 and 10, in Sy. No. 46, total admeasuring 786 Sq. Yards or equivalent to 657.19 Sq. Meters, situated at Pedda Amberpet Village, Abdullapurmet Revenue Mandal (formerly under Hayathnagar Revenue Mandal), Under Pedda Amberpet Nagara Panchayath, Ranga Reddy District. If anybody has got any objection of claim of the above Suit Schedule Property may appear before the Honorable court on 08-06-2026 at 10:30 AM either by a person or through pleader (or) else the matter will be decided according to law.

// BY ORDER OF THE COURT //
Sd/-P. BHARATH CHANDRA,
GANDRA MANOJ KUMAR,
Advocate, Office at Choutuppal Village and Mandal, Yadadri Bhuvanagiri District, Cell: 8464849353.

ఆలంఖాన్‌గూడాలో జోరుగా మట్టి తవ్వకాలు

శంకర్‌పల్లి, మే 26, ప్రభాతవార్త : శంకర్‌పల్లి మండలం ఆలంఖాన్‌గూడా గ్రామంలో మట్టి తవ్వకాలు జోరుగా కొనసాగుతున్నాయి. గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 423 పట్టా భూమిలో భారీగా మట్టిని తవ్వి తరలిస్తున్న ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. స్థానిక రైతులను వివరణ కోరగా, తమ పొలాలకు సరైన దారి లేకపోవడంతో భూమిని సరిచేసుకునేందుకు మట్టిని తీసుకెళ్తున్నామని తెలిపారు. ఈ విషయమై శంకర్‌పల్లి తహసీల్దార్‌ను సంప్రదించగా, పొలాల అవసరాల కోసం అయితే మట్టిని తీసుకోవచ్చు అని సూచించారని రైతులు పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం జరుగుతున్న తవ్వకాల పరిమాణం చూస్తే సాధారణ వ్యవసాయ అవసరాలకంటే ఎక్కువగా మట్టి తరలింపు జరుగుతోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భారీ యంత్రాలతో మట్టిని తవ్వడం, ట్రాక్టర్ల ద్వారా తరలించడం వంటి దృశ్యాలు స్థానికులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇలాంటి తవ్వకాలకు అధికారిక అనుమతులు ఉన్నాయా..? మైనింగ్ శాఖ, రెవెన్యూ శాఖ

నుంచి స్పష్టమైన పర్మిషన్లు తీసుకున్నారా..? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రైతుల అవసరాల పేరుతో అక్రమ మట్టి వ్యాపారం జరుగుతోందా..? అనే సందేహాలు కూడా వినిపిస్తున్నాయి. మట్టి తవ్వకాల వల్ల భూసార నష్టం, భూగర్భ జలాలపై ప్రభావం పడే అవకాశం ఉందని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాస్తవ పరిస్థితులను వెలుగులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

సబ్సిడీపై రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ

శామీర్‌పేట, మే 26, ప్రభాతవార్త: శామీర్‌పేట మండల కేంద్రంలో ఉన్న సొసైటీలో రైతులకు 50శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలను శామీర్‌పేట సొసైటీ చైర్మన్ ఆర్. మధుకర్‌రెడ్డి, మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి. నర్సింలుయాదవ్, ఎంసిపల్లి మున్సిపల్ చైర్మన్ జాము రవి పాల్గొని పంపిణీ చేశారు. మంగళవారం మూడుచింతలపల్లి మండల కేంద్రంలో సొసైటీ సెంటర్‌లో సబ్సిడీపై విత్తనాలను వారు పాల్గొని పంపిణీ చేశారు. జనుము 40కిలోల బస్తాకు పూర్తి ధర 6,220రూపాయలు ఉన్నట్లు, దీనిలో సబ్సిడీ 3,110రూపాయలు ఉన్నట్లు రైతు చెల్లించాల్సిన ధర రూ.3,110రూపాయలు అని అన్నారు. జిలుగ 30కిలోల బస్తాకు 4,905రూపాయలు అని, దీనిలో సబ్సిడీ 2,452రూపాయలు ఉన్నట్లు, ఇక రైతు చెల్లించాల్సింది రూ.2,452.50 అని తెలిపారు. రైతులకు 50శాతం సబ్సిడీపై జనుము, జిలుగ విత్తనాలు పంపిణీ చేయటానికి సిద్ధంగ ఉన్నట్లు వారు తెలిపారు. కావలసిన రైతులు పట్టాదారు పాసుబుక్‌తో విచ్చేసి ఎఇఒను సంప్రదించాలని సూచించారు. రైతు వ్యవసాయ సహకార సంఘంలో (సొసైటీలో) అందుబాటులో ఉన్నట్లు పచ్చిరొట్ట ఎరువులు వేయటం వల్ల నేల ఆరోగ్యంగ ఉంటుందని, భూమిలో కార్బన్ శాతం భూమిలో సారం పెరుగుతుందన్నారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించుకోవచ్చని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు మూడుచింతలపల్లి మండల వ్యవసాయ అధికారిణి వి.ప్రవీణ, పలువురు కౌన్సిలర్లు, నాయకులు, ఎఇఒ సురేశ్‌రెడ్డి, పలువురు రైతులు పాల్గొన్నారు.

పథకాల అమలు, నిధుల కేటాయింపులపై వాడి వేడిగా చర్చ

అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రజా ప్రతినిధులు

దుద్యాల్, మే 26, ప్రభాత వార్త: దుద్యాల్ మండల సమగ్ర అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల కేటాయింపు, వినియోగం, చెల్లింపులపై కాడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో సర్పంచ్లు, ప్రజాప్రతినిధుల సమక్షంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. పలు శాఖల అధికారులు తమ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలు చదివి వినిపించారు. జరిగిన అభివృద్ధిని జరగబోయే అభివృద్ధి గురించిన ప్రణాళికలు, నిధుల గురించి వివరించారు. దుద్యాల్ సర్పంచ్ సంగీత వాణి మాట్లాడుతూ.. మండల కేంద్రంలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని కోరారు. కాడ ప్రత్యేక అధికారి సానుకూలంగా స్పందించారు. అల్లిఖాన్ పల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు ఇద్దరే ఉపాధ్యాయులు ఉన్నారని అదనంగా ఉపాధ్యాయులను కేటాయించాలని కోరారు. రోటిబండ తండా సర్పంచ్ మాట్లాడుతూ పాఠశాల భవన నిర్మాణానికి ఏకగ్రీవ తీర్మానం చేసిన కొందరు నాయకులు అడ్డుపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గౌరారం సర్పంచ్ మాట్లాడుతూ వరి తూకం చేసిన రైతులకు టోకెన్లు ఇచ్చి బిల్లులు చేయాలని అధికారులను కోరారు. విద్యుత్ శాఖ అధికారులు మాట్లాడుతూ.. లగచర్ల హకీంపేట్ లలో 33/11 కెవి సబ్ స్టేషన్ల పనులను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. దుద్యాల మండల కేంద్రంలో 63 కెవి సబ్ స్టేషన్ మంజూరుకు ప్రతిపాదనలు పంపామన్నారు. రూ. 9300/ డిడి చెల్లిస్తే ఒక కిలోమీటర్ వరకు పోల్స్ అందిస్తామని

అన్నారు. వ్యవసాయ ఉద్యానవన శాఖ అధికారులు మాట్లాడుతూ.. ఆయిల్ ఫామ్ సాగుకు రైతులు ముందుకు రావాలని జిల్లా వ్యాప్తంగా 7 వేల ఎకరాలలో ఆయిల్ ఫామ్ సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. కొడంగల్ లో ఆయిల్ ఫ్యాక్టరీ రాబోతుందని అన్నారు. విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ.. సోమ్లా నాయక్ తండా, రోటి బండ తండా, వాల్యా నాయక్ తండాలలో పాఠశాలలు పునః ప్రారంభించడానికి సర్పంచ్, గ్రామస్తుల సహకారం అవసరమని బడిబాట కార్యక్రమానికి సహకరించాలన్నారు.

కాడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. మండలంలో నిర్మాణంలో ఉన్న గ్రామపంచాయతీ భవనాలను వేగంగా పూర్తి చేయాలన్నారు. ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటులో భూములు కోల్పోయిన రైతులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని, అలాగే రోడ్డు వెడల్పు లో ఇల్లు కోల్పోయిన వారికి ఇందిరమ్మ ఇల్లు కేటాయిస్తామన్నారు.

అభివృద్ధికి కావలసినన్ని నిధులు ఇస్తామని, కలిసి పనిచేసి గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు.

పెట్రోలు ధరలు తగ్గించాలని కాంగ్రెస్ ధర్నా

షాద్‌నగర్, మే 26, ప్రభాతవార్త : పెరిగిన పెట్రోల్, డీజిల్‌ధరలు తగ్గించేవరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పేర్కొన్నారు. పెట్రోల్, డీజిల్ ధరల పెంపు ను నిరసిస్తూ మంగళవారం షాద్ నగర్ నియోజక వర్గ కేంద్రంలో ధర్నా నిర్వహించారు. ఫరూక్ నగర్ మండల పార్టీ అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు నలమోని శ్రీధర్ తదితరుల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ పెద్ద ఎత్తున పెరిగిన పెట్రోల్ డీజిల్ ధరలపై ఆర్డిఒ కార్యాలయం ముందు నినాదాలతో ఆందోళన చేశారు. మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్, కాంగ్రెస్ పార్టీ గిరిజన విభాగం కోఆర్డినేటర్ రఘునాయక్, మండల పార్టీ అధ్యక్షులు పురుషోత్తం రెడ్డి రమేష్, జాకారం చంద్రశేఖర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజ్ గౌడ్, జండాగూడెం సుదర్శన్ గౌడ్, పట్టణ కౌన్సిలర్లు, మహిళా విభాగం నాయకురాళ్ళు తదితరులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి ఆడియో సరితకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఐఎన్టీయూసీ రాష్ట్ర కార్యదర్శి పి. రఘునాయక్ మాట్లాడుతూ పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు సామాన్యుడి పాలిట శాపంగా మారాయని అన్నారు. యువజన కాంగ్రెస్ నాయకుడు మండల పార్టీ అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం మత రాజకీయాలతో పబ్బం గడుపుతుందని విమర్శించారు. ఈ ఆందోళనలో షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బస్వం, వైస్ చైర్మన్ అందే మోహన్, కాంగ్రెస్ పార్టీ గిరిజన విభాగం కోఆర్డినేటర్ రఘు నాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు రాయికల్ శ్రీనివాస్, పురుషోత్తం రెడ్డి, అన్మాగల్ల రమేష్ , జాకారం చంద్రశేఖర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజు గౌడ్, పట్టణ అధ్యక్షుడు నల్లమోనీ శ్రీధర్, జాండ గూడెం సుదర్శన్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నేతలు, చల్లా శ్రీకాంత్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, ఇబ్రహీం, ఖాదర్ ఘోరీ సర్పంచుల చించెడ్ శ్రీనివాస్ , ఆర్ బాబు నాయక్, ,కొమ్ము కృష్ణ, అయ్యవారి పల్లి గోపాల్ రెడ్డి, మంకల శ్రీశైలం, నర్సింహులు, తేజ్యా నాయక్, కౌన్సిలర్ల బచ్చలి నరేష్, మురళి మోహన్ , కొప్పునూర్ ప్రవీణ్, సోలిపూర్ అనిల్, నేతలు తుపాకుల శేఖర్, జాంగారి రవి, లింగారెడ్డి గూడ అశోక్, ఖదీర్, గిరిజన నేత శ్రీను నాయక్, బుడ్డ నర్సింహులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కర్ణ కర్ , నర్సింహులు, సురేష్ గౌడ్, సోలీపూర్ శ్రీశైలం గౌడ్, జాంగారి జంగయ్య, చిన్న, ముభరక్ అలీ, కరోల్ల సురేందర్, దాఖం మనీష్, బాల గంగాధర్, చించెడ్ అనంతం, హైదర్ ఘోరీ, మల్లేష్ గౌడ్, మల్లారెడ్డి, నిరటి వాసు, సుమన్ నాయక్, భాస్కర్ నాయక్, మార్గం రాజేష్ , రోమియో రమేష్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సింగాపగ అనిల్ కుమార్ , మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు నాగి సాయిలు, భాస్కర్, గణేష్ నాయక్, రాజు నాయక్, కటి కేల తిరుపతి యాదవ్, కావాలి నర్సింహులు, కెవిఎం, మహేష్ యాదవ్, రమేష్, మహిళ నేతలు నాగమణి, గుండె రాణి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సర్పంచులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

పర్యావరణానికి ముప్పు కలిగించే ఎకో టౌన్ వద్దు

షాద్‌నగర్, మే 26, ప్రభాతవార్త : ఇండస్ట్రియల్ పార్కు కోసమని పేదలు భూములు ఇచ్చారు.. ఇక్కడ ఉపాధి దొరుకుతుందని భావించారు.. తీరా పర్యావరణంతో పాటు ప్రజల జీవితాలను నాశనం చేసే ఏకో టౌన్ మాకొద్దని షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ జిహెచ్ఎంసి కమిషనర్‌తో అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం సిద్దాపూర్ గ్రామంలో ఏకో టౌన్ ను ఏర్పాటు చేయవద్దని స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ ను కలిశారు. స్థానిక నాయకుడు తాండ్ర కాశీనాథ్ రెడ్డితో కలిసి కమిషనర్ ను ప్రత్యేకంగా కలుసుకున్నారు. మేము ఎకో టౌన్ ప్రతిపాదనకు పూర్తిగా వ్యతిరేకం, మా ప్రజలు ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పడితే ఇక్కడి ప్రజలకు ఉపాధి దొరుకుతుందని భూములు ఇచ్చారు కానీ ఎకో టౌన్ లాంటి ప్రతిపాదన తెచ్చి మా ప్రాంతాలలో పర్యావరణ సమస్యలను కొని తెచ్చుకోవడానికి సిద్ధంగా లేమని ఎమ్మెల్యే కమిషనర్ కు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆర్.వి.కర్ణన్ మాట్లాడుతూ.. ఎకో టౌన్ ఏర్పాటు కోసం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో 4 చోట్ల ప్రతిపాదనలు ఉన్నాయని తెలిపారు. ఏకో టౌన్ లో కేవలం చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి (వేస్ట్ టు ఎనర్జీ) అనేది మున్సిపల్ ఘన వ్యర్థాలను (మురికి చెత్త) ఇంధనంగా మార్చి విద్యుత్తును తయారు చేస్తారు. అలాగే రీసైక్లింగ్ ప్రక్రియ చేస్తారు అని తెలిపారు. సిద్దాపూర్ లో ఏకో టౌన్ ప్రతిపాదన వద్దని ఎమ్మెల్యే కోరుతున్నందున ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు

పది స్కూల్ టాపర్‌కు నగదు బహుమతి

ఘట్‌కేసర్, మే 26, ప్రభాతవార్త: ఘట్‌కేసర్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పదవితరగతి పరీక్షల్లో స్కూల్ టాపర్‌గా నిలిచిన వద్యావత్ భానుప్రకాష్‌కు ఇందిరమ్మ కమిటీ సభ్యులు బొక్క సత్తిరెడ్డి నగదు బహుమతి అందజేశారు. ఎస్ఎస్‌సీలో 600 మార్కులకు గాను 561 మార్కులు సాధించిన భానుప్రకాష్‌ను పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు కొమిరెడ్డి పాపిరెడ్డి చేతుల మీదుగా సత్తిరెడ్డి విద్యార్థికి రూ.3,100లు నగదు బహుమతి అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు శ్రద్ధగా చదివి ఉత్తమ మార్కులు పొందిన విద్యార్థికి ప్రోత్సాహక బహుమతిని అందించినట్లు సత్తిరెడ్డి, వర్షిత్‌రెడ్డిలు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు యశ్వాల్, సుబాషిణి, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తూరులో చోరీ కలకలం

ఇంటి తాళం పగులగొట్టి బంగారం, వెండి అపహరణ

కొత్తూరు, మే 26, ప్రభాతవార్త: కొత్తూరు మండల కేంద్రంలో చోరీ ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఇంటికి తాళం వేసి వెళ్లిన కుటుంబం తిరిగి వచ్చేసరికి తాళాలు పగులగొట్టి బంగారం, వెండి ఆభరణాలతో పాటు మొబైల్ ఫోన్‌ను గుర్తు తెలియని దుండగులు అపహరించిన ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తూరు గ్రామంలోని రైల్వే స్టేషన్ రోడ్‌కు చెందిన గొల్ల కుమార్ (32), వృత్తిరీత్యా డ్రైవర్. ఈ నెల 23వ తేదీన డ్రైవింగ్ డ్యూటీకి వెళ్లగా, తన భార్య శృతి కాంతి ఇంట్లోనే ఉన్నట్లు తెలిపాడు. అనంతరం ఈ నెల 24వ తేదీన సాయంత్రం ఆమె ఇంటికి తాళం వేసి స్వ గ్రామమైన వికారాబాద్ జిల్లా మొమిన్‌పేట్ మండలం చక్రంపల్లికి వెళ్లినట్లు సమాచారం. ఈ నెల 26వ తేదీ తెల్లవారుజామున డ్యూటీ ముగించుకొని ఇంటికి వచ్చిన కుమార్‌కు షాక్ తగిలింది. ఇంటి తాళం పగులగొట్టబడగా, తలుపు కొద్దిగా తెరిచి ఉండటాన్ని గమనించాడు. వెంటనే లోపలికి వెళ్లి చూడగా బెడ్‌రూమ్‌లోని బీరువా తాళం చెవి షెల్ఫ్ పక్కన పడివుండగా, బీరువా తెరిచి ఉండటాన్ని గుర్తించాడు. దుండగులు బీరువాలో ఉంచిన సుమారు రెండు తులాల బంగారు ఆభరణాలు, 30 తులాల వెండి వస్తువులు, అలాగే డ్రెస్సింగ్ టేబుల్ డ్రాయర్‌లో ఉన్న పాత ఐఫోన్ మొబైల్ ఫోన్‌ను అపహరించినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. అపహరించబడిన బంగారు వస్తువుల్లో చెవిపోగులు, గొలుసు, వంకీ, ముక్కుపుడక, ఉంగరం ఉండగా.. వెండి వస్తువుల్లో కాళ్ల పట్టీలు, వెండి నాణేలు, చిన్నారి నడుము గొలుసు ఉన్నట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కొత్తూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రాంతంలో సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తూ దుండగుల కోసం గాలింపు చేపట్టారు.

చోరీ జరిగిన ఇంట్లో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

మోకాళ్లపై నిరసన తెలుపుతున్న విఏఓలు

మోకాళ్లపై నిరసన

కుల్కచర్ల, మే, 26 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం విఏఓల సమస్యలను పరిష్కరించాలని మోకాళ్లపై విన్నూత నిరసన తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని విఏఓలు సమ్మెను కొనసాగించారు. ఈ సందర్భంగావారు మాట్లాడుతూ...తమ నాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించేంతవరకు సమ్మె నిర్వహిస్తామని అన్నారు. విఏఓలకు కనీస 20వేల వేతనం అందించాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి హెచ్‌ఆర్ పాలసి వర్తింప, జేయాలని, అర్హులైన వీవోఏలను సిసిలుగా పదోన్నతులు కల్పించాలని, విఏఓలకు సాధారణ, ఆరోగ్య బీమా 20 లక్షలు కల్పించాలని, ప్రభుత్వం తమతో ఎకువగా ఫోన్‌లతో యాప్‌లతో పనిచేయిసుందని, దీనికిగాను ట్యాబ్‌లు ఇవ్వాలని, 58జీవోను సవరించాలని కోరారు. తమ సమస్యలు పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున్న అందోళనచేస్తామని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల విఏఓలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మానవ హక్కుల కమిషన్ అధ్యక్షులుగా కేతావత్ హరిలాల్ ఎన్నిక

నందిగామ, మే 26, ప్రభాతవార్త : అంతర్జాతీయ మానవ హక్కుల కమిషన్ జిల్లా అధ్యక్షులుగా కేతావత్ హరిలాల్ నియమితులైనట్లు ఆ సంస్థ నేషనల్ చైర్మన్ అడ్వకేట్ కే అనిల్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన జిల్లా అధ్యక్షులు హరిలాల్ మాట్లాడుతూ సమాజంలో మానవ హక్కులకు భంగం కలిగినట్లయితే బాధితుల పక్షాన మానవ హక్కుల కమిషన్ అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుత సమాజంలో పేద బడుగు బలహీన వర్గాలకు జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలపై మానవ హక్కుల కమిషన్ పోరాడుతుందన్నారు. తనపై నమ్మకంతో, విశ్వాసంతో తనను మానవ హక్కుల కమిషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులుగా నియమించినందుకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బాల్యవివాహాలు జరిపిస్తే కేసులు నమోదు చేస్తాం

చేవెళ్ల మున్సిపల్ కమిషనర్ యాదగిరి

చేవెళ్ల, మే 26, ప్రభాతవార్త : బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని చేవెళ్ల మున్సిపల్ కమిషనర్ యాదగిరి తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మంగళవారం చేవెళ్ల మున్సిపల్ పట్టణ కేంద్రంలో బాల్యవివాహల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... బాల్యవివాహల నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో ఎక్కడైన బాల్యవిహాలు జరుగుతున్నట్లు తెలిస్తే ప్రజలు సమాచారం అందించాలని సూచించారు. చిన్నవయస్సులో పెళ్లిలు జరిగితే ఇబ్బందులు వస్తాయని గుర్తు చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం బాల్యవివాహలు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అమ్మాయిలను భాగా చదివించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కళ్యాణి, మానిషారెడ్డి, సీడీపీవో తస్సిబా, పూజారి శ్రీపాదు, అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, మహిళలు తదితరులు ఉన్నారు.

50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు

మండల వ్యవసాయ అధికారి దండెం విజయచంద్ర

షాబాద్, మే 26, ప్రభాతవార్త : 50 శాతం సబ్సిడీపై ప్రభుత్వం అందిస్తున్న పచ్చి రొట్టె విత్తనాలను రైతులు సాగు చేసుకుని భూసారాన్ని పెంపొందించుకోవాలని మండల వ్యవసాయ అధికారి దండెం విజయచంద్ర పేర్కొన్నారు. మంగళవారం ఈ మేరకు పత్రిక ప్రకటన విడుదల చేశారు. మండల కేంద్రంలోని పిఏసీఎస్ కోఆపరేటివ్ సొసైటీలో జీలుగ, జనుము విత్తనాలు సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పచ్చి రొట్ట విత్తనాలు కావలసన రైతులకు కనీసం ఒక ఎకరం భూమి ఉండాలని, పట్టా పాసుబుక్, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులు తీసుకురావాలని పేర్కొన్నారు. ఈ నెల 27వ తేదీన ఆయా గ్రామాల రైతు వేదికలలో వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి టోకెన్ (రసీదు) తీసుకున్న అనంతరం షాబాద్ కోఆపరేటివ్ సొసైటీలో విత్తనాలు పొందవచ్చని తెలిపారు. ముందుగా వచ్చిన రైతులకు ప్రాధాన్యం ఇవ్వబడుతుందని చెప్పారు. జనుము విత్తనాల క్వింటాలు పూర్తి ధర రూ.15,550 కాగా, 50 శాతం సబ్సిడీ తర్వాత రైతులు రూ.7,775 మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. 40 కిలోల బస్తా ధర రూ.3,110గా ఉందన్నారు. అదేవిధంగా జీలుగ విత్తనాల క్వింటా పూర్తి ధర రూ.16,350 కాగా, సబ్సిడీ అనంతరం రైతులు రూ.8,175 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. 30 కిలోల బస్తా ధర రూ.2,452.50గా నిర్ణయించినట్లు వెల్లడించారు. పచ్చిరొట్టె పంటల సాగు ద్వారా భూసారం పెరుగుతుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

షాద్‌నగర్‌లో లలితక్క విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

షాద్‌నగర్, మే 26, ప్రభాతవార్త : తెలంగాణ కోసం తన జీవితాన్ని అర్పించిన వీర వనిత బెల్లి లలిత అని గొర్ల కాపరుల సంఘం జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు, షాద్ నగర్ సీనియర్ యాదవ సంగం నాయకులు గున్న భీమయ్య యాదవ్ అన్నారు. సామాజిక విప్లవకారిని, గాన కోకిల బెల్లి లలిత 27వ వర్ధంతి సందర్భంగా మంగళవారం షాదనగర్ చౌరస్తాలో యాదవ సంగం అద్వర్యంలో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బెల్లి లలితక్క చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి ఆమె సేవలను గుర్తు చేసుకున్నారు. బెల్లి లలితక్క అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. అనంతరం యాదవ సంగం రాష్ట్ర నాయకులు దంగు శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ చైతన్యం బెల్లి లలితక్క తన చివరి శ్వాస వరకు తెలంగాణ పాటలు పాడిందని, ఆమె జీవితం ఎంతో ఆదర్శం అని అన్నారు. షాద్ నగర్ లో బెల్లి లలితక్క విగ్రహ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో యాదవ్ సంగం నాయకులు అన్నారం మల్లేష్ యాదవ్, తాలూకా అధ్యక్షుడు షాబాద్ మల్లేష్ యాదవ్, మున్సిపాలిటీ టౌన్ అధ్యక్షుడు నక్క బాల్ రాజ్ యాదవ్, జిల్లా నాయకులు నడికూడ యాదగిరి యాదవ్, తదితరులు పాల్గొని బెల్లి లలితకు ఘనంగా జోహార్లు అర్పించారు.

ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ

తలకొండపల్లి, మే 26, ప్రభాత వార్త: రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డిఎంహెచ్‌వో) డా. స్వర్ణకుమారి ఈరోజు తలకొండపల్లి మండలంలోని గట్టి ఇప్పలపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీచేసి పలురికార్డులను పరిశీలించారు.

ఈ సందర్భంగా డిఎంహెచ్‌వో డా, సూర్యకుమారి ఆసుపత్రిలోని ఓపి సేవలు, వార్డులు, ల్యాబ్, ఫార్మసీ, మందుల నిల్వలు, పారిశుధ్య పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించారు. హాజరు రిజిస్టర్, స్టాక్ రిజిస్టర్, రోగుల కేస్ షీట్లు తనిఖీ చేసి, వైద్యులు. వైద్య సిబ్బందితో మాట్లాడారు.

ఈ సందర్భంగా ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై డిఎంహెచ్‌వో అసంతృప్తివ్యక్తం చేస్తూ, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న వైద్యులు. వైద్య సిబ్బందిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటున్నానని హెచ్చరించారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రతి పేద రోగికి నాణ్యమైన వైద్యం అందించాలి. సమయపాలన పాటించాలి. డాక్టర్లు, సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలి. మందుల కొరత లేకుండా చూసుకోవాలి. ఆసుపత్రి ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలి" అని సిబ్బందికి సూచించారు.

గర్భిణీ స్త్రీలకు అందుతున్న సేవలు, పీహెచ్సీ లో ,కుక్క కాటు, పాము, కోతికాటుకు సంబంధించిన వ్యాక్సిన్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. టీకా. కార్యక్రమాలు, సీజనల్ వ్యాధుల నివారణ. ప్రభుత్వ ఆదేశానుసారం. వడదెబ్బకు సంబంధించి కేసుల వివరాలపై ఆరా తీశారు. ఎవరైనా మృతి చెందితే చర్యలపై డా. స్వర్ణకుమారి ప్రత్యేకంగా సమీక్షించారు. రాబోయే. వర్షాకాలం దృష్ట్యా డెంగ్యూ, మలేరి యా వంటి విష జ్వరాలు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని వైద్యాధికారులను ఆదేశించారు.

రోగులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న సేవలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.

ఈ కార్యక్రమంలో తలకొండపల్లి. గట్టి ఇప్పలపల్లి. పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్, సిబ్బంది, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

బాల్యవివాహాలను అరికడదాం

నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ

నందిగామ, మే 26, ప్రభాతవార్త : బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ అన్నారు. మంగళవారం నందిగామ మండల కేంద్రంలో మహిళా సమాఖ్య కార్యాలయంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మహిళ వారోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 18 సం,, రాలు మధ్య వయస్సు గల కిశోరా బాలికలు సోషల్ మీడియా ఇన్ స్టా గ్రామ్ , ఫేస్ బుక్ వలలో పడొద్దు అని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డీఏ మండల ఎపియం భగవంతు , ఉపసర్పంచ్ వెంకటేష్ గౌడ్ ,వార్డ్ సభ్యులు అగ్గి ప్రసాద్ , బొమ్మగల నర్సింహులు , శివగళ్ల సురేష్ , సమాఖ్య కార్యదర్శి అరుంధతి , అంగన్వాడీ టీచర్లు సుజాత, వరలక్ష్మి, కమలమ్మ, ఆశావర్కర్లు నీలమ్మ ,నవనీత , సీసీ అర్చన , సీబీవో ఆడిటర్ యాదగిరి ,వివోఎలు శోభ , లక్ష్మి , రేణుక , మరియు కిశోరా బాలికలు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం..నిండు ప్రాణం బలి

కుల్కచర్ల, మే, 26 ప్రభాతవార్త: విద్యుత్ షాక్ వ్యక్తి మృతి చెందిన సంఘటన కుల్కచర్ల మండల పోలీస్‌స్టెషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానిలు తెలపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని హన్మరనాయక్ తాండలో రెండు రోజుల క్రితం ఈదురు గాలులకు విద్యుత్ స్తంబాలు విరిగి పడ్డ సంఘటన తెలిసివదే..తాండ వాసులు అధికారులకు, ప్రజాప్రతినిధులకు సమాచారం ఇచ్చారు. విద్యుత్ అధికారులు తూతూ మంత్రంగా పరిశీలించి వచ్చారు. తాండకు చెందిన నేనావత్ చందర్ అనే వ్యక్తి ఇంట్లో రెండు రోజులు కరెంటు రావడం లేదని విద్యుత్ అధికారులకు చెప్పిన పట్టించుకోలేదని తనే స్తంభం ఎక్కి విద్యుత్ వైర్లు రిపేర్ చేస్తున్న సమయంలో కరెంటు షాక్ తగిలి నేనావత్ చందర్ కింద పడి మృతి చెందాడు. తండ్రి చావుకు కారణం అయిన కరెంట్ అధికారులపై నేనావత్ అజయ్ పోలీస్‌స్టెషన్‌లో ఫిరాదు చేశాడు, ఈ మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ రమేష్ కుమార్ తెలిపారు.

ప్రభుత్వం వివోఏల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

చేవెళ్ల, మే 28, ప్రభాతవార్త : వీవోఏల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం అలస్యం చేయకుండా ముందుకు వచ్చి సమస్యను పరిష్కరించాలని వివోఏల సంఘం మండల అధ్యక్షురాలు కవిత, ప్రధాన కార్యదర్శి ప్రమీల, మండల సలహాదారుడు చంద్రశేఖర్, కోశాధికారి జ్యోతి తెలిపారు. వీవోఏల సమ్మెలో భాగంగా మంగళవారం చేవెళ్ల మండల కేంద్రంలోని మహిళ సమాఖ్య భవనం ముందు 9వ రోజు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రభుత్వం వీవోఏలకు ప్రతి నెల రూ.20 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించడంలో వివోఏల పాత్ర చాలా కీలకమన్నారు. ప్రభుత్వం వీవోఏల పనులు గుర్తించడం లేదన్నారు. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు పద్మ, ఆస్రాబేగం, సుశీల, మం జుల, మాధవి, హేమలత, లలిత, సుజాత, కవిత, స్వప్న, శిరీష, జంగయ్య, అమృత, నిర్మల, అనిత, కవిత తదితరులు ఉన్నారు.

ప్రతి చిన్నారి బడిబాట పట్టాలి

పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు మల్లేష్ గౌడ్

షాబాద్, మే 26, ప్రభాతవార్త : ప్రతి చిన్నారి బడిలో చదువుకోవాలని ఎంపిపిఎస్ యెల్గొండగూడ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు మల్లేష్ గౌడ్ అన్నారు. షాబాద్ మండల పరిధిలోని ఎంపిపిఎస్ యెల్గొండగూడ గ్రామ పాఠశాలలో మంగళవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలకు విద్య యొక్క ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ప్రతి చిన్నారి తప్పనిసరిగా పాఠశాలకు హాజరై ఉత్తమ విద్యను అభ్యసించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గ్రామంలోని వీధుల గుండా ర్యాలీ నిర్వహించి, తల్లిదండ్రులకు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న నాణ్యమైన విద్య, మౌలిక వసతులు, ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకం వంటి సౌకర్యాలను గ్రామస్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ నాయకులు మామిడిపల్లి శ్రీనివాస్, నరేందర్ రెడ్డి, మల్లారెడ్డి, శ్రీనివాస్ చారి, కుమ్మరి మురళి, రాఘవేందర్ చారి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పాత నేరస్తులకు కౌన్సిలింగ్ నిర్వహించిన మల్కాజిగిరి సిపి

జవహర్ నగర్, మే 26, ప్రభాతవార్త: మల్కాజ్గిరి కమిషనరేట్ పరిధిలో నేరాల నియంత్రణకు పోలీసులు చేపడుతున్న చర్యల్లో భాగంగా, జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ ను మల్కాజ్గిరి సీపీ సుమతి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిధిలోని పాత నేరస్తులకు ప్రత్యేక కౌన్సిలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నేరాల అదుపులో కమిషనరేట్ ముందువరసలో నిలుస్తోందని సీపీ సుమతి పేర్కొన్నారు. ముఖ్యంగా యువత చెడు మార్గాలకు లోనుకాకుండా సత్ప్రవర్తనతో జీవించి, సమాజంలో ఉన్నత స్థానంలో నిలబడాలని సూచించారు. అలాంటి బాధ్యతా యుత జీవన విధానమే దేశ గౌరవాన్ని పెంచుతుందని ఆమె తెలిపారు. అనంతరం పాత నేరస్తులను ఒక్కొక్కరిని విడిగా విచారించి, వారికి తగిన సూచనలు చేస్తూ సన్మార్గంలో నడవాలని కౌన్సిలింగ్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి కమీషనర్ శ్రీధర్, జవహర్ నగర్ ఏసీపీ చక్రపాణి, జవహర్ ఇన్స్పెక్టర్ సైదులు. తదితర పోలీసు అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.



అకాల వర్షానికి రూ. 6 లక్షలు నష్టం

షాద్‌నగర్, మే 26, ప్రభాతవార్త : ఫరూక్ నగర్ మండలం నాగులపల్లి గ్రామంలో రైతు గోపాలరెడ్డి బ్రాయిలర్ పౌల్ట్రీ షెడ్ నిన్న వచ్చిన అకాల వర్షం ఈదుర గాలులకు పూర్తిగా కూలిపోయిందని, భారీ నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని రైతు కోరుతున్నాడు . ఈ విషయం తెలిసిన గ్రామ సర్పంచ్ రాధికా అశోక్ రెడ్డి రైతు గోపాల్ రెడ్డిని ఆదుకోవాలని ఫరూక్ నగర్ తహసిల్దా కు ఫిర్యాదు చేశారు. పంచనామా చేసి కలెక్టర్ కు నివేదిక పంపిస్తాను అని తహసీల్దార్ చెప్పినట్లు సర్పంచ్ రాధికా అశోక్ రెడ్డి తెలిపారు.

కడ్తాల్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన కమిషనర్

కడ్తాల్, మే 26, ప్రభాతవార్త : స్నేహపూర్వక పోలీసింగ్‌పై దృష్టి సారించి ప్రతి ఫిర్యాదును స్వీకరించి త్వరితగతిన పరిష్కరించి ఫిర్యాదుదారుడికి న్యాయం జరిగే విధంగా చూడాలని ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి అన్నారు. మంగళవారం కడ్తాల్ పోలీస్ స్టేషన్ ను కమిషనర్ తరుణ్ జోషి, మహేశ్వరం డిసిపి నారాయణరెడ్డి, ఏసిపి జానకి రెడ్డిలతో కలిసి ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ఆవరణను పరిశీలించి, విధుల్లో ఉన్న అధికారులు, పోలీసు సిబ్బందితో మాట్లాడారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేషన్‌కు వచ్చే ప్రజా ఫిర్యాదులను అత్యంత మర్యాదతో స్వీకరించాలని, బాధితుల సమస్యలను శ్రద్ధగావినాలని, అలాగే చట్టప్రకారం త్వరితగతిన పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు పోలీస్ వ్యవస్థపై నమ్మకం పెరిగేలా ప్రతి ఫిర్యాదును తీసుకోవాలని ఆయన ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజలతో స్నేహపూర్వక పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. విధుల్లో నిరక్ష్యం లేకుండా సమయ పాలనతో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు పర్యావరణాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అంటూ పిలుపునిచ్చారు. ఆయన వెంట కడ్తాల్ ఇన్ స్పెక్టర్ సైదిరెడ్డి, ఎస్సైలు వరప్రసాద్, చంద్రశేఖర్, పోలీస్ సిబ్బంది లు పాల్గొన్నారు.

మేడ్చల్ సిఐ సత్యనారాయణకు సిసి కెమెరాలను అందిస్తున్న ఆప్తార్ సంస్థ ప్రతినిధులు

సిసి కెమెరాల విరాళం

మేడ్చల్, మే 26, ప్రభాతవార్త : కమ్యూనిటీ భద్రతను బలోపేతం చేయడంలో తమ వంతు సహాయంగా ఆప్తార్ సంస్థ మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌లో సిఐ సత్యనారాయణకు 12 సిసి కెమెరాలను విరాళంగా అందించింది. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ సిసి కెమెరాల ఏర్పాటు వల్ల ప్రజా ప్రదేశాలను మరింత సమర్థవంతంగా పర్యవేక్షి ంచడానికి, నేర కార్యకలాపాలు, ప్రమాదాలను అరికట్టడంతో పాటు సంఘటనలకు త్వరగా స్పందించడానికి మాకు ఎంతో సహాయపడుతుందని అన్నారు. ప్రజా భద్రత కోసం కెమెరాలు అందించడం ద్వారా సమాజానికి సహాయం చేయడం చాలా సంతోషంగా ఉందని, ఇతర కంపెనీలు కూడా ముందుకు వచ్చి, సురక్షి తమైన సమాజ నిర్మాణం కోసం కెమెరాలను విరాళంగా అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న నాయకులు

సిఎం ప్రకటించిన వేతనాల సవరణ కార్మికులకు వ్యతిరేక నిర్ణయం

మేడ్చల్, మే 26, ప్రభాతవార్త : సిఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన వేతనాల సవరణ కార్మికులకు వ్యతిరేక నిర్ణయమని తెలంగాణ మున్సిపల్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె యేసు రత్నం అన్నారు. తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) సమావేశాన్ని మంగళవారం గుండ్ల పోచంపల్లిలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన యేసురత్నం ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్మికులకు కనీస వేతనం రూ. 20 వేలు పెంచామని చెప్పుకోవడం హాస్యపదంగా ఉందన్నారు. కార్మికులను మూడు భాగాలుగా విభజించి కార్మికులకు తీరని అన్యాయం చేశారని మండిపడ్డారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు అమలు చేయాలన్నారు. విధి నిర్వహణలో మరణించిన కార్మికుల అంత్యక్రియల ఖర్చుల కోసం రూ.30 వేల ఆర్థిక సహాయం అందించాలని, అలాగే మృతి చెందిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉద్యోగావకాశం కల్పించాలని డిమాండ్ చేశాడు.

అదేవిధంగా కాంటాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులకు 15 క్యాజువల్ లీవ్స్ (సీఎల్‌లు) మంజూరు చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోను వెంటనే అమలు చేయాలన్నారు. అలాగే మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని, రెండో పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని, రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అన్నారు. జూన్ 23, 24 తేదీలలో నిర్వహించనున్న రాష్ట్ర మున్సిపల్ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశం అనంతరం నూతన తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ కమిటీనీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కమిటీ అధ్యక్షుడుగా బి రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బి ప్రభాకర్, ఉపాధ్యక్షులుగా డి యాదమ్మ, పి వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా వి హరినాథ్ రావు, డిప్యూటీ జర్నల్ సెక్రెటరీగా బి కిరణ్, సహాయ కార్యదర్శులుగా ఏ శివ. డి కృష్ణ, కోశాధికారిగా బి భానుచందర్, కమిటీ సభ్యులుగా సావిత్రి, దశరథ్, అనిత, అశోక్, బాలేష్, ఆంజనేయులు, అమృత,రజిత, శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మున్సిపల్ సంఘం రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి, మేడ్చల్ జిల్లా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాస్, కార్మికులు పాల్గొన్నారు.

బిజెపి యువ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా మహేందర్

షాబాద్, మే 26, ప్రభాతవార్త : భారతీయ జనతా పార్టీ యువ మోర్చా (బీజేవైఎం) తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు గణేష్ షాబాద్ మండలం మాచన్‌పల్లి గ్రామానికి చెందిన కూతురు మహేందర్‌ను నియమించారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ యువత కోసం పార్టీ చేస్తున్న సేవలకు, కార్యకర్తల పట్ల చూపుతున్న ఆదరణకు ఇది తగిన గుర్తింపు అని పేర్కొన్నారు. తమ నాయకత్వంలో బీజేవైఎం మరింత శక్తివంతంగా ముందుకు సాగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యత అప్పగించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు, బీజేపీ యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గణేశ్, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే రత్నం అన్న, రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, మండల నాయకులు, పార్టీ కార్యకర్తలందరికీ ధన్యవాదాలు తెలిపారు. మహేందర్ నియామకంపై స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు.

ఎబోలా వైరస్ నేపథ్యంలో థర్మల్ స్క్రీనింగ్ ఏర్పాటు

రంగారెడ్డి అర్బన్ ,మే 26,ప్రభాతవార్త : ఎబోలా వ్యాప్తి నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యగా శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలోని రాకల విభాగంలో ఎయిర్పోర్ట్ హెల్త్ ఆర్గనైజేషన్ థర్మల్ స్క్రీనింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేసింది. అంతర్జాతీయంగా వచ్చే ప్రతి ప్రయాణికుడికి థర్మల్ స్క్రీనింగ్ నిర్వహించబడుతుంది. దీని ద్వారా ప్రారంభ దశలోనే గుర్తింపు చేసి ప్రజారోగ్య భద్రతను మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు.

ప్రాంతీయ ఆసుపత్రి నిర్మాణ పనులు పరిగి ఎమ్మెల్యే పరిశీలన

పరిగి, మే26, ప్రభాతవార్త : వికారాబాద్ జిల్లా, పరిగి పట్టణంలో రూ.27 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న 100 పడకల ప్రాంతీయ ఆస్పత్రి నిర్మాణ పనులను పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి పరిశీలించారు.మంగళవారం పరిగి ప్రభుత్వ ఆసుపత్రిలో డిజిటల్ ఎక్స్ రే సేవలను ఆయన ప్రారంభించారు. పరిగి ప్రాంత ప్రజలకు వైద్యం అందించాడనికి ,అత్యాధునిక వసతులతో 100 పడకల ఆసుపత్రి నిర్మించి త్వరలోనే అన్ని రకాల వైద్య సేవలను ప్రజలకు అందించేలా

జిల్లా వైద్యాధికారికి సమస్యలు వివరిస్తున్న ముల్తంకర్ శివాజీ

సిబ్బంది లేక ఇబ్బందులు పడుతున్న రోగులు

కేశంపేట ,మే 26, ప్రభాతవార్త :వివిధ రకాల అనారోగ్య సమస్యలతో ఆసుపత్రికి వచ్చిన రోగులకు చికిత్స అందించేందుకు సిబ్బంది లేక అనేక రకాల ఇబ్బందులు పడుతున్న రోగులు, కేశంపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసిన రంగారెడ్డి జిల్లా వైద్యాధికారిని డి ఎం హెచ్ ఓ స్వర్ణ కుమారికి బిజేవైఎం రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి మల్తూంకర్ శివాజీ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ.. ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో సిబ్బంది లేకపోవడం వలన రోగులకు పూర్తిస్థాయిలో వైద్యం అందకపోవడం వలన ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రోగులు పడుతున్న సమస్యలను దృష్టిలో ఉంచుకొని ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించాలని ఆయన కోరారు. అసంపూర్తిగా మిగిలి పోయిన 30 పడకల ఆసుపత్రి భవనం పూర్తి చేసి వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని కోరారు.

కొత్త పెన్షన్లపై ప్రజల గందరగోళం

దోమ,మే 26, ప్రభాతవార్త: కొత్త ఫించన్ల దరఖాస్తుల విషయంలో గ్రామాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారనీ మండల మాజీ వైస్ ఎంపిపి గుర్మిట్‌కల్ మల్లేశం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్టిఫికెట్ల కోసం మీసేవ కేంద్రాల చుట్టూ తిరుగుతూ గందరగోళానికి గురవుతున్నారన్నారు. గ్రామల్లో ప్రజలు ఎండల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్న నూతన పింఛన్లకు దరఖాస్తు చేసుకోవాలా వద్ద అనే విషయంలో ఉన్నారని ఈ విషయంపై అధికారులు స్పందించక పోవడం శోచనీయం అని అన్నారు. ఎన్నికల్లో కుటుంబంలో భార్య భర్తలకు ఇద్దరికి ఇస్తామనిచెప్పి రెండున్నర సంవత్సరాలు దాటిన ఇప్పటి వరకు కొత్త ఫింఛన్లు మంజూరు చెయ్యలేదని తెలిపారు. అమలు గాని హామిలకె తప్ప ఈ ప్రభుత్వం ఆచరణలో అమలు చేయడం లేదు మే22 నుండి25,30 వరకు దరఖాస్తు స్వీకరిస్తారంటూ తేదిలతో కూడిన పోస్టర్లు వాట్సాప్ గ్రూపుల్లో విపరీతంగా వైరల్ అయ్యాయి .ప్రచారాన్ని నమ్మి వృద్ధులు, దివ్యంగులు మీ సేవ, జీరాక్స్ సెంటర్ల చుట్టూ ,ప్రభుత్వ కార్యలయాల చుట్టూ తిరుగుతున్నారు. అవసరమైన సర్టిఫికెట్ల కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై అధికారులు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించాలని తెలిపారు.

ఫార్మాకంపెనీ ఏర్పాటుకై రైతులతో ఆర్‌డిఓ సమావేశం

దోమ,మే26,ప్రభాతవార్త: మండల పరిధిలోని అంతిరెడ్డిపల్లి ,బట్లచందా రం గ్రామాలలో పార్మ కంపెనీ ఏర్పాటు కోసం సుమారుగా 350 ఎకరాల భూమి అవసరము ఉన్నదని అదికారులు గుర్తించారు. ఈ విషయంపై మంగళవారం నాడు దోమ మండల పరిధిలోని అంతిరెడ్డిపల్లి గ్రామములో వికారాబాద్ జిల్లా ఆర్‌డిఓ వాసుచంద్ర దోమ తహసిల్‌దార్ గోవిందమ్మలు రైతుల అబిప్రాయం సేకరించారు. గ్రామములోని రైతులు భూమి కోల్పోతే అనాథలము అవుతామని ఉన్న చిన్నపాటి భూములు గుంజుకుంటే కుటుంబాలు వీధిన పడుతామని రైతులు తమ బాధను వ్యక్తం చేశారు. ప్రభుత్వం నష్టపరిహారం పెంచి భూములుతీసుకోవాలని కోరారు. ఈ విషయంపై అధికారులు పోలీసుల రక్షణతో రైతులు వివరాలు సేకరించి ప్రభుత్వానికి పంపుతామని తెలిపారు. ఈ కార్యక్రమములో దిర్సంపల్లి సర్పంచ్ విజయలక్ష్మి, డిప్యూటి తహసీల్‌దార్ నర్సిములు, మూడు పోలిస్‌స్టేషన్‌ల సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన గురుకుల కళాశాలలో ఇంటర్ దరఖాస్తుల స్వీకరణ

కొడంగల్,మే 26,ప్రభాతవార్త: కొడంగల్‌లోని గిరిజన గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరానికి గాను మిగిలిన సీట్ల భర్తీకి గాను అర్హులైన విద్యార్దుల నుంచి ధరఖాస్తులు స్వీకరించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.కొండయ్య (ఎఫ్‌ఏసీ) ఓ ప్రకటలో తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశం కోరే విద్యార్ధులు విద్యా సంబంధిత ధృవపత్రాలతో పాటు కులం, ఆదాయం సర్టిఫికెట్‌లతో కళాశాలలో ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మిగతా వివరాలకు 8333925370,7032759950 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

రైతులకు పచ్చి రొట్ట ఎరువుల పంపిణీ

కొడంగల్,మే 26,ప్రభాతవార్త: కొడంగల్ మండలానికి సరఫరా అయిన పచ్చి రొట్ట ఎరువులను పిఎసిఎస్ అధ్యక్షులు కట్కం శివ కుమార్‌గుప్త రైతులకు పంపిణీ చేశారు. మంగళవారం స్థానిక పిఎసిఎస్ కార్యాలయంలో రైతులకు పచ్చి రొట్ట ఎరువులను అందించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు మాట్లాడుతూ మండలానికి 100 బస్తాల పచ్చి రొట్ట ఎరువులు సరఫరా కావడం జరిగిందని ,ఇందుకు గాను రైతులకు సబ్సీడిపై అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి, ఎఇఒలు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహం.. బాలికల భవిష్యత్తుకు శాపం

షాబాద్, మే 26, ప్రభాతవార్త : బాల్యవివాహాలు బాలికల భవిష్యత్తు కు శాపంగా మారి, వారి జీవితాలు బుగ్గి పాలు అవుతాయని షాబాద్ ఎంపీడీవో అపర్ణ, సర్పంచ్ అశోక్ లు అన్నారు. షాబాద్ మండల కేంద్రంలోని బీసీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం బాల్య వివాహం – బతుకు ఆగం అనే అంశంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన షాబాద్ ఎంపీడీవో అపర్ణ మాట్లాడుతూ.. బాల్య వివాహాలు బాలికల చదువు, ఆరోగ్యం, భవిష్యత్తును దెబ్బతీస్తాయని పేర్కొన్నారు. చిన్న వయస్సులో వివాహాలు చేయడం చట్ట విరుద్ధమని, అలాంటి వివాహాల వల్ల బాలికలు అనేక సమస్యలను ఎదుర్కొంటారని వివరించారు. బాల్య వివాహాల వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, విద్యాభంగం, కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందుల గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రతి బాలికకు ఉన్నత విద్య అందించి, స్వయం ప్రతిభతో ఎదిగే అవకాశాలు కల్పించాలని సూచించారు. అనంతరం వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పీఎఐసీ సిద్ధులూరు సంజీవ, వార్డు సభ్యుడు ముకురం, అంగన్‌వాడీ టీచర్లు హైమావతి, తల్లులు, కిశోర బాలికలు, చిన్నారులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌కు గురై జాతీయ పక్షి నెమలి మృతి

నందిగామ, మే 26, ప్రభాతవార్త : నందిగామ మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత, రైతు జిల్లెల్ల బాల్ రెడ్డి వ్యవసాయ పొలం శివారులో మంగళవారం ఉదయం విద్యుత్ ప్రమాదానికి గురై నెమలి మృతి చెందింది. ఈ సంఘటన విషయమై బాల్ రెడ్డి స్థానిక ఇన్స్పెక్టర్ ప్రసాద్ కు సమాచారం అందించడంతో శంషాబాద్ రేంజ్ ఫారెస్ట్ సిబ్బంది వెంకటేష్ నందిగామకు వచ్చి జాతీయ పక్షి నెమలిని తీసుకెళ్లినట్లు తెలిపారు.

ఫీల్డ్ అసిస్టెంట్ నిర్లక్ష్య వైఖరిపై కూలీల ఆగ్రహం

..పదిహేను రోజులుగా హాజరు నమోదు లేక కూలీల ఆందోళన

......సమస్య పరిష్కారం కోసం యంపిడిఓ కార్యాలయం ముట్టడి

పెద్దేముల్, మే 26, ప్రభాతవార్త: ఫీల్డ్ అసిస్టెంట్ నిర్లక్ష్య వైఖరిపై కూలీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్దేముల్ మండలం మారేపల్లితాండాకు చెందిన సుమారు 70 మంది గత పదిహేను రోజులుగా ఉపాధి పనులు చేసిన హాజరు వేయకపోవడంతో ఆగ్రహించిన కూలీలు మంగళవారం పెద్దేముల్ మండల యంపిడిఓ కార్యాలయాన్ని ముట్టడించారు. మండుటెండలను సైతం లెక్క చేయకుండా ఉపాధి పనులకు వెళితే హాజరు వేయకపోవడం ఎంత వరకు సమంజసమని యంపిడిఓ, ఉపాది హామీ ఎపిఓ ముందు తమ గోడును వెళ్ళబోసుకున్నారు. క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారుల పర్యవేక్షణలోపం కారణంగా కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లు నిర్లక్ష్యం వహిస్తున్నారని, దీంతో తమకు వేతనాలు అందడం లేదని ఆరోపించారు. మండుటెండల్లో కష్టపడి పనిచేస్తున్నప్పటికి హాజరు నమోదు చేయకపోవడం అన్యాయమని అన్నారు. పనిచేసిన తమ హాజరు వేయకపోవడం వల్ల తమకు వచ్చే కూలి డబ్బులు ఎలా వస్తాయని ఆందోళన వ్యక్తంచేశారు. వెంటనే హాజరు నమోదు చేసి బకాయి డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్య ఇలానే కొనసాగితే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని కూలీలు హెచ్చరించారు. అయితే ఇది ఇలా ఉండగా ఫీల్డ్ అసిస్టెంట్ ఒక వేళ కూలీల హాజరు వేసిన మస్టర్ పేమెంటు చేయించవలసి ఉంటుంది. 15 రోజులు పనిచేసిన కూలీలకు డబ్బులు చెల్లించకపోవడంలో సంబంధిత అధికారుల నిర్లక్ష్యం కూడా ఉంది. ఉపాధి పనుల, కూలి డబ్బుల చెల్లింపుల విషయంలో సంబంధిత అధికారులు క్షేత్రస్థాయికి వెళ్ళకుండా, కార్యాలయాలకే పరిమితం కావడంతో సమస్యలు తీవ్రరూపం దాలుస్తున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. విషయాన్ని తెలుసుకున్న మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు రుద్రారం మహిపాల్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ పెండ్యాల ప్రవీన్‌కుమార్ గుప్తా ఉపాధి కూలీలను సముదాయించి యంపిడిఓకు వారి సమస్యను విన్నవించి పరిష్కారం అయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

యంపిడిఓ ముందు ఆందోళన వ్యక్తంచేస్తున్న ఉపాధి కూలీలు

యంపిడిఓ తిరుమలస్వామి, ఎపిఓ నర్సిములు వివరణ :

ఇట్టి విషయమై యంపిడిఓను, ఎపిఓను వివరణ కోరగా, పనిచేసిన ఉపాధి కూలీలకు హాజరు వేసి వారి డబ్బులు ఇప్పించేలా చూస్తామని అన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ నిర్లక్ష్యం వల్ల హాజరు వేయలేకపోయారని, అందుకు ఆయనకు మెమో జారీచేస్తామని, అంతేగాకుండా డిఆర్‌డిఓకు ఫిర్యాదు చేస్తామని అన్నారు.

సెన్సెస్ ఎన్యుమరేటర్‌లు పారదర్శకతతో పనిచేయాలి

కీసర,మే26,ప్రభాతవార్త: సెన్సెస్ ఎన్యుమరేటర్‌లు పారదర్శకతతో పనిచేయాలని మల్కాజిగిరి జోనల్ కమీషనర్ సంచిత్ గంగ్వార్ అన్నారు. మంగళవారం కీసర సర్కిల్ పరిధిలోని అహ్మద్‌గూడ రాజీవ్ గృహకల్ప చీర్యాలలోని జెఎన్‌ఎన్‌ఆర్‌యుఎం కాలనీ, డబుల్ బెడ్‌రూం కాలనీలలో సెన్సెస్ 2027 కి సంబంధించి సర్వే ఎలా కొనసాగుతుంతో అని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాతుడూ ప్రజలు కూడా సెన్సెస్ ఎన్యుమరేటర్‌లకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమీషనర్ వసంత, ఏఎంసిలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మహిళ సంఘంలో చేరి ఆర్థికంగా ఎదగాలి

కొత్తూరు, మే 26, ప్రభాతవార్త: ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న 99 రోజుల ప్రత్యేక కార్యచరణలో భాగంగా మంగళవారం కొత్తూరు మున్సిపల్ పట్టణంలో మహిళా సాధికారతకు కొత్త ఊపు వచ్చింది. మే 25 నుంచి 30 వరకు జరుగుతున్న మహిళా వారోత్సవాల సందర్భంగా రంగారెడ్డి జిల్లా మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటనారాయణ కొత్తూరులో పర్యటించారు. ఈ సందర్భంగా కొత్తూరు పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అన్‌కవర్డ్ ఎస్‌హెచ్‌జీ ఉమెన్ ఇంటింటి సర్వే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మహిళల ఇళ్లకు వెళ్లి స్వయం సహాయక సంఘాల ప్రాధాన్యతను వివరించారు. అనంతరం మహిళలతో కలిసి బాల్య వివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. బాల్య వివాహాలు సమాజానికి శాపం అని పేర్కొంటూ, ప్రతి కుటుంబం అమ్మాయిల భవిష్యత్తును కాపాడాలని సూచించారు. అలాగే కిశోర బాలికలకు గర్భాశయ క్యాన్సర్ నివారణలో కీలకమైన హెచ్‌పివి వ్యాక్సిన్‌పై అవగాహన కల్పించారు. ఆరోగ్యమే మహాభాగ్యం.. ప్రతి బాలిక వ్యాక్సిన్ తీసుకోవాలి అని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. మహిళలతో మమేకమైన మెప్మా పీడీ వెంకటనారాయణ మాట్లాడుతూ.. ప్రతి మహిళ స్వయం సహాయక సంఘంలో చేరి ఆర్థికంగా ఎదగాలి. తెలంగాణ ప్రభుత్వం మహిళల అభివృద్ధి కోసం తీసుకొస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి అని సూచించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ఎన్. బాలాజీ, డిస్ట్రిక్ట్ మిషన్ కోఆర్డినేటర్ అశోక్, టౌన్ మిషన్ కోఆర్డినేటర్ సిలివేరి, మెప్మా రిసోర్స్ పర్సన్స్, అంగన్వాడీ సిబ్బంది, వైద్య సిబ్బంది, మునిసిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

రంగారెడ్డి అర్బన్ మే 26,ప్రభాతవార్త : ఓ గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన శంషాబాద్ రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సిఐ నరేందర్ రెడ్డి వివరాల ప్రకారం.. ఈనెల 22న పెద్ద గోల్కొండ గ్రామ పరిధిలోని శ్రీకృష్ణ ఫార్మసీ కంపెనీ ఎదురుగా ఉన్న ఆర్ఆర్ సర్వీస్ రోడ్ కల్వర్ట్ క్రింద ఒక వ్యక్తి తలకు తీవ్ర రక్తగాయాలతో పడి ఉన్నాడని డయల్100 ద్వారాం సమాచారం అందడంతో వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించగా, సుమారు 45 నుండి 50 సంవత్సరాల వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలో కనిపించాడు. వెంటనే 108 అంబులెన్స్ ద్వారా ఉస్మానియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఆ వ్యక్తి వివరాలు, బంధువుల ఆచూకీ కోసం చుట్టుపక్కల విచారించినప్పటికీ ఎలాంటి సమాచారం లభించలేదు.

అతని దుస్తులు మాసిపోయి ఉండటం, గడ్డం పెరిగి ఉండటంతో బిక్షాటన చేసుకునే వ్యక్తిగా పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే చికిత్స పొందుతూ ఈనెల 24న మృతి చెందినట్లు ఉస్మానియా ఆసుపత్రి వైద్యులు నిర్ధారించారు.

ప్రమాదవశాత్తు ఎక్కడైనా కిందపడటం వల్ల తలకు తీవ్ర గాయం తగిలి ఉండవచ్చని ఫిర్యాదుదారుడు అనుమానం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధిహామీ కూలీలకు అల్పాహారం అందజేత

కుల్కచర్ల,మే,26 ప్రభాతవార్త: ఉపాధి హామీ పనులు ఉదయం సమయంలోనే పూర్తి చేసుకోవాలని సర్పంచ్ శ్రీనివాస్ నాయక్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని లాల్‌సింగ్ తాండ గ్రామ పంచాయతీ ఉపాధి హామీ కూలీలకు అల్పాహారంగా పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ.. ఎండలు తీవ్రత నుండి రక్షపకు టెంట్లు లేద చెట్ల నీడకు ఉండాలని సూచించారు. పని సమాయంలో తాగు నీరు వెంట తెచ్చుకోవాలని తెలిపారు.

దౌల్తాబాద్ నూతన తహసీల్దార్‌గా వెంకటస్వామి

దౌల్తాబాద్,మే 26,ప్రభాతవార్త:

కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ మండల నూతన తహసీల్దార్‌గా వెంకటస్వామి శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ గాయత్రి యాలాల మండలానికి బదిలీ కాగా, అక్కడ విధులు నిర్వహిస్తున్న వెంకటస్వామిని దౌల్తాబాద్‌కు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. ఈ సంధర్భంగా నూతన తహసీల్దార్ వెంకటస్వామి మాట్లాడుతూ...మండల కేంద్రంతో పాటు పరిధిలోని వివిధ గ్రామాల్లో ఉన్న రెవెన్యూ, ధరణి భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తానని హామీ ఇచ్చారు. ప్రజలకు, రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు శాయశక్తులా కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

మహిళ కమిషన్ సభ్యురాలిని కలిసిన రజక సంఘం నాయకులు

చేవెళ్ల, మే 26, ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర మహిళ కమిషన్ సభ్యురాలుగా ఇటీవల భాధ్యతలు తీసుకుచ్చిట్యాల శ్వేతను చేవెళ్ల మండల రజక సంఘం నాయకులు పాలకుర్తిలో కమిషన్ సభ్యురాలు శ్వేత నివాసంలో మార్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు వీరనారీ చాకలి ఐలమ్మ వరసురాలు చిట్యాల శ్వేత ఇటీవల రాష్ట్ర మహిళ కమిషన్ సభ్యురాలు భాధ్యతలు తీసుకున్న సందర్భంగా ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపడం జరిగిందని రజక సంఘం జిల్లా సీనియర్ నాయకులు సిహెచ్, జంగయ్య, గుండాల శ్రీనివాస్ తెలిపారు. శ్వేత మున్ముందు మరెన్నో పదవులు చేపట్టి రాష్ట్ర ప్రజలకు, రజక సంఘం అభివృద్ధికి తోడ్పటు అందించాలని కోరుడం జరిగిందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మండల రజక సంఘం మాజీ అధ్యక్షుడు చెన్నయెల్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు పాండు, న్యాలట మాజీ ఉప సర్పంచ్ శ్రీశైలం తదితరులు ఉన్నారు.

జనుములతో తక్కువ పెట్టుబడి ఎక్కువ రాబడి

..మండల వ్యవసాయ అధికారి పవన్‌ప్రీతమ్

పెద్దేముల్, మే 26, ప్రభాతవార్త: జనుముల(పచ్చి ఎరువు) వల్ల పంటలు తక్కువ పెట్టుబడితో ఎక్కువ రాబడి వస్తుందని పెద్దేముల్ మండల వ్యవసాయ అధికారి పవన్‌ప్రీతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పవన్‌ప్రీతమ్ మాట్లాడుతూ పచ్చి ఎరువుతో యూరియ వాడకాన్ని తగ్గించవచ్చని, నేల సూక్ష్మ జీవులకు రక్షణగా ఉంటుందని అన్నారు. ఎరువులపై ఖర్చును తగ్గించుకోవచ్చని, నేలలో సేంద్రియ కార్బన్‌ను మెరుగుపరచవచ్చని అన్నారు. అంతే గాకుండా నేలల్లో నత్రజని శాతాన్ని పెంచవచ్చని అన్నారు. జనుములను అన్ని రకాల పంటలలో వినియోగించుకోవచ్చని అన్నారు. జనుము 40 కిలోల బస్తాకు రూ. 3110 ఒక్క బస్తా 2.5 ఎకరాలకు వినియోగించుకోవచ్చని అన్నారు. జనుములు కావలసిన వారు పాస్‌బుక్, ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్‌తో సంబంధిత ఎఇఒను సంప్రదించి టోకన్ పొందాలని కోరారు.

ముమ్మరంగా సాగుతున్న ఫార్మర్ రిజిస్ట్రేషన్

ధారూర్, మే 26, ప్రభాత వార్త: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ధారూర్ మండలంలో ముమ్మరంగా సాగుతోంది. ఇందులో భాగంగా గురుదోట్ల క్లస్టర్ పరిధిలోని దోర్నాల గ్రామంలో వ్యవసాయ విస్తరణ అధికారి సంజీవ్ రాథోడ్ ఆధ్వర్యంలో రైతులకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు.

గ్రామంలోని రైతు వేదిక భవనంలో ఏఈఓ స్వయంగా రైతులకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్ ద్వారా నమోదు చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ విస్తరణ అధికారి సంజీవ్ రాథోడ్ మాట్లాడుతూ, ప్రభుత్వం అందించే వివిధ రకాల సంక్షేమ పథకాలు, సబ్సిడీలు, పీఎం కిసాన్ వంటి ప్రయోజనాలు నేరుగా రైతుల ఖాతాల్లో జమ కావాలంటే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ రిజిస్ట్రేషన్ వల్ల భవిష్యత్తులో పంట బీమాతో పాటు వివిధ ప్రభుత్వ పథకాల లాభాలు నేరుగా అందుతాయని, ఒకవేళ నమోదు చేసుకోకపోతే ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను కోల్పోయే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు.

ఇంకా నమోదు చేసుకోని రైతులు ఎవరైనా ఉంటే, వారు వెంటనే తమ ఆధార్ కార్డ్, ఆధార్ నంబర్‌కు లింక్ అయిన మొబైల్ నంబర్, పట్టాదార్ పాస్ పుస్తకం వివరాలతో స్థానిక రైతు వేదిక వద్ద ఏఈఓను సంప్రదించి ఉచితంగా నమోదు చేసుకోవచ్చని లేదా మీసేవా కేంద్రాలను ఆశ్రయించవచ్చని తెలిపారు. దోర్నాల గ్రామంలోని అర్హులైన రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వంద శాతం రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సంగెం గ్రామంలో ప్రమాణం చేయిస్తున్న సర్పంచ్ వేణుగోపాల చారి

బాల్య వివాహాల నిర్మూలన సహజ బాధ్యత

- ఐసిడిఎస్ సూపర్వైజర్ దివ్య సింగ్

కేశంపేట, మే 26, ప్రభాతవార్త :బాల్య వివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని ఐసిడిఎస్ సూపర్వైజర్ దివ్య సింగ్ అన్నారు. మంగళవారం కేశంపేట, చింతకుంటపల్లి, సంగెం, గ్రామాలలో ఆయా గ్రామాల సర్పంచులు పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పిస్తూ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా దివ్య సింగ్ మాట్లాడుతూ చట్టబద్ధత వివాహ వయసు 18 సంవత్సరాలు ఆడపిల్లకు, 21 సంవత్సరం వయస్సు పురుషులకు కచ్చితంగా ఉండాలని చట్టబద్ధత వయస్సును తప్పనిసరిగా పాటిస్తామని పిల్లల విద్య ఉద్యోగం భద్రత మరియు గౌరవాన్ని కాపాడుతామని, ఎక్కడైనా బాల్య వివాహ సమాచారం తెలిసితే వెంటనే అధికారులకు తెలియజేస్తామని ఆయా గ్రామాల మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. అక్షర జ్ఞానం నేర్చుకుంటూ బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాల్సిన బాలికలను బాల్య వివాహాల పేరిట సంకెళ్లతో బంధించడం సామాజిక నేరమని దీని నిర్మూలనకు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని అధికారులు మరియు సామాజిక విశ్లేషకులు వీటిపై నిబద్ధత ఉండాలని ఆమె సూచించారు.

బాల్య వివాహాలు ఎక్కడైనా జరుగుతున్నట్లు ఎవరి దృష్టి కైనా వచ్చినట్లయితే వెంటనే మహిళ హెల్ప్ లైన్ నెంబర్ 181 ఫోన్ చేసి సమాచారం అందించాలని ఆమె తెలిపారు.

ఫోన్ చేసిన సమాచారాన్ని అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్య క్రమంలో కేశంపేట సర్పంచ్ బొజ్జం సంతోష శ్రీశైలం యాదవ్, చింత కుంటపల్లి సర్పంచ్ పోచమోని రమేష్ యాదవ్, సంగెం సర్పంచ్ వేణు గోపాల చారి, ఆశా కార్యకర్తలు సుమతి లక్ష్మమ్మ,సరస్వతి, అంగన్వాడి కార్యకర్తలు సుమతి, సునంద, మాధవి, లక్ష్మి, అమృత, మాధవి, వెంకటేశ్వర శర్మ, ఆయా గ్రామాల మహిళలు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రసాయన శాస్త్రంలో హరిప్రియకు డాక్టరేట్

కొడంగల్,మే 26,ప్రభాతవార్త: కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయన శాస్త్రం అధ్యాపకురాలిగా విధులు నిర్వహిస్తున్న యం.హరిప్రియకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భోపాల్‌కు చెందిన మానస సరోవర్ గ్లోబల్ విశ్వ విద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. డాక్టర్ ఉపమా మిశ్రా పర్యవేక్షణలో సింథసైజ్ అండ్ క్యారెక్టరైజ్ ద బయలాజికల్ అండ్ యాంటి ఫంగల్ ప్రాపర్టీస్ అఫ్ సింథసైజ నికెల్(2) క్యాంపెకెసస్ అండ్ నికెల్ ఆక్సైడ్ నానో పార్టికల్స్ అను అంశంపై సమర్పించిన సిద్దాంత గ్రంధానికి ఈ డిగ్రీని అవార్డు చేశారని, తమ కళాశాల అధ్యాపకురాలు అత్యున్నత డిగ్రీని పొందడం తమకెంతో గర్వకారణమని, ఇది ఆమె నిరంతర కృషికి, పట్టుదలకు నిదర్శనమని ప్రిన్సిపాల్ డాక్టర్.బి.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్.యం.హరిప్రియను ప్రిన్సిపాల్, సిబ్బంది అభినందించారు.